తెలంగాణ TELANGANA MUCHATLU
TELTEL/2023/88710
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
వరంగల్ | గురువారం-20- నవంబర్ 2025 | సంపుటి : 3 | సంచిక : 173 | పేజీలు - 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in

# మహిళల ఆత్మగౌరవానికి కోటి చీరలు



## సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు

- కోటి మంది ఆడబిడ్డలకు కోటి ఇందిరమ్మ చీరలు పంపిణీ ప్రారంభం
- ఇందిరాగాంధీ స్ఫూర్తితో సంక్షేమ పథకాలు: సీఎం రేవంత్
- గ్రామీణ–పట్టణ ప్రాంతాల్లో విడతల వారీగా పంపిణీ

హైదరాబాద్, నవంబర్ 19 (తెలంగాణ ముచ్చట్లు):




తెలంగాణలో మహిళల ఆత్మగౌరవాన్ని మరింత బలపర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం కోటి ఇందిరమ్మ చీరలను అందజేస్తోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. అర్హులైన ప్రతీ ఆడబిడ్డకు చీర అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందని చెప్పారు. బుధవారం ఇందిరమ్మ చీరల పంపిణీని ప్రారంభించిన ఆయన పలువురు లబ్ధిదారులకు చీరలను అందజేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, దేశ రాజకీయాల్లో శూన్యత ఏర్పడిన సమయంలో ఇందిరాగాంధీ ప్రధానిగా బాధ్యతలు చేపట్టి దేశానికి శక్తివంతమైన నాయకత్వం అందించారని గుర్తుచేశారు. అంబేద్కర్ ఆశయ సాధన కోసం కూడా ఇందిరాగాంధీ ఎంతో కృషి చేశారని చెప్పారు. ఇదే స్ఫూర్తితో తమ ప్రభుత్వం ముందుకు వెళ్తోందని పేర్కొన్నారు.

మిగతా 2లో



## కోటి మహిళలకు చీరల పంపిణీపై సీఎం రేవంత్ స్పష్టమైన దిశానిర్దేశం

- కార్యక్రమం సమన్వయంపై ముఖ్యమంత్రి ఆదేశాలు
- ప్రతి మహిళకు చీర చేరేలా పారదర్శక పద్ధతి
- మహిళల ఆర్థిక శక్తివృద్ధే ప్రభుత్వ లక్ష్యం



హైదరాబాద్, నవంబర్ 19 (తెలంగాణ ముచ్చట్లు):

కోటి మంది మహిళలకు కోటి చీరలను పంపిణీ చేసే మహద్భారీ సంక్షేమ కార్యక్రమంలో ఎలాంటి లోపాలు తలెత్తకుండా అధికారులు సమగ్ర సమన్వయంతో పనిచేయాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి స్పష్టంగా ఆదేశించారు. "మహిళల ఉన్నతి - తెలంగాణ ప్రగతి" కార్యక్రమం కింద ఇందిరమ్మ మహిళా శక్తి చీరల పంపిణీపై సచివాలయంలో జరిగిన సమీక్షలో సీఎం కీలక నిర్ణయాలు ప్రకటించారు.
సీఎం లాంఛనంగా చీరల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, పలువురు మంత్రులు, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని జిల్లాల కలెక్టర్లు, మహిళా సమాఖ్యల ప్రతినిధులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ఏ ఒక్క మహిళ కూడా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, సంప్రదాయంగా ఆడపడుచులకు

మిగతా 2లో



## టీజీ–టెట్ 2026 కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఉచిత డిజిటల్ కోచింగ్ ప్రారంభం

- 44 రోజుల ప్రత్యేక శిక్షణ కార్యక్రమం
- రోజుకు 4 గంటల ప్రత్యక్ష పాఠాలు
- టి–సాట్ నిపుణ, విద్య చానెళ్లలో ప్రసారాలు

హైదరాబాద్, నవంబర్ 19 (తెలంగాణ ముచ్చట్లు):




టెట్ అభ్యర్థుల కోసం తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. టీజీ-టెట్ 2026 పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థుల ప్రయోజనార్థం రేవంత్ ప్రభుత్వం డిజిటల్ ఉచిత కోచింగ్ కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఐటీ & ఇండస్ట్రీస్ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు ఈ కొత్త పథకాన్ని ప్రారంభిస్తూ, అభ్యర్థులు ఈ అవకాశాన్ని పూర్తిగా వినియోగించుకోవాలని సూచించారు. ప్రత్యక్ష ఓరియంటేషన్ క్లాసులు నవంబర్ 19న టి-సాట్ ద్వారా ప్రారంభమవుతున్నాయి. అనంతరం వరుసగా 44 రోజులపాటు 200 ఎపిసోడ్‌లతో

మిగతా 2లో

## తెలంగాణ నీటి హక్కులపై కేంద్రంలో స్పష్టత కోరిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

- పాలమూరు–రంగారెడ్డి, సమ్మక్క సాగర్ అనుమతులు పెండింగ్
- కృష్ణా జలాల విభజన తీర్పు వేగవంతం చేయాలన్న విజ్ఞప్తి
- పోలవరంలింక్, అల్మట్టి ఎత్తు పెంపుపై తెలంగాణ అభ్యంతరం



హైదరాబాద్, నవంబర్ 19 (తెలంగాణ ముచ్చట్లు):
తెలంగాణ నీటి హక్కులు, సాగు ప్రాజెక్టుల అనుమతులపై రాష్ట్రం చాటి చెబుతున్న ఆందోళనలను మరోసారి కేంద్రానికి వివరించింది. జలశక్తి మంత్రి సి.ఆర్. పాటిల్‌ను కలిసిన రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, కృష్ణా–గోదావరి ప్రవాహ ప్రాంతాలకు సంబంధించిన పలు కీలక అంశాలను చర్చించారు. అనేక ప్రతిపాదనలు, నివేదికలు కేంద్ర నీటి కమిషన్‌లో

మిగతా 2లో

## బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి కొత్త ఊపు

- తెలంగాణ భవన్‌లో కాంగ్రెస్ నేతల బీఆర్ఎస్ చేరికలు
- శేరిలింగంపల్లి నాయకులు బీఆర్ఎస్ వైపు
- కేటీఆర్ సమక్షంలో విమల్‌కుమార్ సహా పలువురు చేరిక

హైదరాబాద్, నవంబర్ 19 (తెలంగాణ ముచ్చట్లు):

తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ పార్టీలోకి కీలక రాజకీయ చేరికలు చోటు చేసుకున్నాయి. శేరిలింగంపల్లి నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ పార్టీ జాయింట్ సెక్రటరీ

2లో



## హిడ్మా హత్యను ఎన్‌కౌంటర్‌గా చూపిస్తున్నారు

- సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సంచలన వ్యాఖ్యలు
- మావోయిస్టుల ఎన్‌కౌంటర్లు వెంటనే ఆపాలని డిమాండ్
- ప్రభుత్వం చర్చల ద్వారా సమస్యల పరిష్కారం కోరాలి
- దండకారణ్యం ఖనిజాల కోసం హత్యల ఆరోపణ



హైదరాబాద్, నవంబర్ 19 (తెలంగాణ ముచ్చట్లు):

మావోయిస్టు అగ్రనేత మడ్వి హిడ్మాను చంపి దానిని ఎన్‌కౌంటర్‌గా చిత్రీకరిస్తున్నారని సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తీవ్ర ఆరోపణలు చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థను ప్రభుత్వం ఖూనీ చేస్తోందని మండిపడ్డ ఆయన, మావోయిస్టులపై జరుగుతున్న ఎన్‌కౌంటర్లను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. బుధవారం జరిగిన మీడియా సమావేశంలో కూనంనేని మాట్లాడుతూ గురువారం మావోయిస్టుల

మిగతా 2లో

## సింగరేణి భవన్ ముట్టడిలో ఉద్రిక్తత

- తెలంగాణ జాగృతి అధినేత్రి కవిత అరెస్ట్
- డిపెండెంట్ ఉద్యోగాల పునరుద్ధరణ, మెడికల్ బోర్డు ఏర్పాటు డిమాండ్
- ముట్టడి అడ్డుకున్న పోలీసులు – తోపులాట
- కవితతోపాటు పలువురు నేతలను నాంపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలింపు

హైదరాబాద్, నవంబర్ 19 (తెలంగాణ ముచ్చట్లు):

సింగరేణి సంస్థలో డిపెండెంట్ ఉద్యోగాలను పునరుద్ధరించాలని, మెడికల్ బోర్డును వెంటనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ జాగృతి అధినేత్రి కల్వకుంట్ల కవిత చేపట్టిన ముట్టడిలో ఉద్రిక్తత ముదిరింది.

2లో



తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# కోటి మహిళలకు చీరల పంపిణీపై సీఎం రేవంత్ స్పష్టమైన దిశానిర్దేశం

(మొదటి పేజీ తరువాయి)

సారె ఇవ్వడం ప్రభుత్వ బాధ్యతగా భావిస్తున్నామని సీఎం చెప్పారు.
విభాగాలన్నీ సమన్వయంతో పనిచేస్తూ నియోజకవర్గాల వారీగా అధికారులను ప్రత్యేకంగా నియమించాలని ఆదేశించారు. స్థానిక ఎమ్మెల్యేలతో పాటు ప్రజాప్రతినిధులందరినీ కార్యక్రమంలో భాగస్వామ్యం చేస్తూ నిర్ణయించిన గడువులోగా చీరల పంపిణీ పూర్తి చేయాలని సూచించారు. ప్రజా ప్రతినిధులకు స్పష్టమైన సమాచారం చేరేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు.
మహిళా సమాఖ్యలు తయారు చేస్తున్న ఉత్పత్తులకు మరింత గుర్తింపు వచ్చేలా శిల్పారామంలో ఇందిరా శక్తి బజార్ ఏర్పాటు చేసినట్లు సీఎం వివరించారు. అలాగే అమెజాన్ ద్వారా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అమ్మకాలు జరిగేలా ప్రభుత్వం చర్చలు జరుపుతుందని వెల్లడించారు. ఇప్పటికే 27 వేల కోట్ల రూపాయల వడ్డీరహిత రుణాలు, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, మహిళా సంఘాలకు పెట్రోల్ బంకులు, సోలార్ ప్లాంట్లు అప్పగించడం వంటి చర్యలతో మహిళల ఆర్థిక శక్తి పెరుగుతోందని గుర్తు చేశారు.
గతంలో డ్రెస్‌కోడ్ లేకపోవడం, రుణాల పంపిణీ లోపాలు వంటి సమస్యలను సరి చేస్తూ ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. చీరల పంపిణీని పండుగ వాతావరణంలో జరపాలన్నదే ప్రభుత్వ సంకల్పమని సీఎం స్పష్టం చేశారు. భవిష్యత్తులో చేపట్టే ప్రతి సంక్షేమ కార్యక్రమానికి ఇది ప్రామాణికంగా నిలవాలని తెలిపారు.
2034 నాటికి కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని సీఎం వెల్లడించారు. మహిళలు ఆర్థికంగా బలపడితే కుటుంబాల్లో సమస్యలు తగ్గి, సమాజంలో స్థిరత్వం పెరుగుతుందని ఆయన అన్నారు. కుల గణన ద్వారా సేకరించిన డేటా ఆధారంగా ఫేషియల్ రికగ్నిషన్, ఆధార్ నమోదు వంటి పారదర్శక పద్ధతుల్లో చీరలు అందించాలని ఆయన హితవు పలికారు.
విభిన్న జిల్లాల మహిళా సమాఖ్యల ప్రతినిధులు కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. చీరల నాణ్యత, రంగులు, డిజైన్లు అద్భుతంగా ఉన్నాయని సిరిసిల్లా, ఆసిఫాబాద్ సమాఖ్యలు వెల్లడించగా, పెట్రోల్ బంకుల నిర్వహణపై నారాయణపేట సమాఖ్య ప్రతినిధుల నుంచి సీఎం ప్రత్యక్ష సమాచారం తీసుకున్నారు. చివరగా సచివాలయంలో మంత్రులు, ఉన్నతాధికారులు పాల్గొనగా, కార్యక్రమం విజయవంతంగా కొనసాగేందుకు అవసరమైన దిశానిర్దేశాలు సీఎం ఇచ్చారు.

# మహిళల ఆత్మగౌరవానికి కోటి చీరలు



(మొదటి పేజీ తరువాయి)

ఇందిరాగాంధీ తీసుకొచ్చిన బ్యాంకుల జాతీయీకరణ, వ్యవసాయ భూముల సీలింగ్ చట్టం, పేదల కోసం ఇండ్ల నిర్మాణం వంటి పథకాలు ప్రజలన్నింటికీ ఉపయోగపడ్డాయని సీఎం వివరించారు. పాకిస్థాన్‌తో యుద్ధ సమయంలో ధైర్యంగా ఎదుర్కొన్న ఉత్తమ నాయకత్వం ఇందిరమ్మదేనని కొనియాడారు. అదే దృఢసంకల్పంతో తెలంగాణలో మహిళల అభివృద్ధి కోసం కార్యక్రమాలు కొనసాగుతున్నాయని ఆయన అన్నారు.
మహిళలకు పెట్రోల్ బంకులు ఇచ్చి ప్రోత్సహించడం, ఆర్టీసీలో వెయ్యి బస్సులకు మహిళలను యజమానులుగా చేయడం వంటి కార్యక్రమాలు మహిళా సాధికారతకు దోహదపడుతున్నాయని సీఎం తెలిపారు. ఆడబిడ్డల పేరుతోనే ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడం మహిళల ఆర్థిక భద్రతకు కీలక అడుగుగా నిలుస్తుందన్నారు. 'మహిళల సంక్షేమమే మా ప్రభుత్వ లక్ష్యం. కోటి మంది ఆడబిడ్డలను కోటీశ్వరులుగా చేయాలని సంకల్పించాం. అందుకే కోటి చీరల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించాం. గ్రామీణ ప్రాంతాల్లో డిసెంబర్ 9 వరకు, పట్టణ ప్రాంతాల్లో మార్చి 1 నుండి




8వ తేదీ మహిళా దినోత్సవం వరకూ చీరలను అందజేస్తాం. ప్రతీ అర్హురాలికి చీర తప్పనిసరిగా చేరుతుంది' అని సీఎం స్పష్టం చేశారు. మొదటి విడతలో 65 లక్షల చీరలను పంపిణీ చేస్తామని, ఉత్పత్తి ప్రక్రియ కారణంగా కార్యక్రమాన్ని రెండు విడతలుగా అమలు చేస్తున్నామని తెలిపారు. మహిళా మంత్రులు, ఎమ్మెల్యేలు, మహిళా అధికారులంతా ఇందిరమ్మ చీరను కట్టుకుని ఆడబిడ్డల ఆత్మగౌరవానికి బ్రాండ్ అంబాసిడర్లుగా మారాలని సీఎం రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు.

# టీజీ-టెట్ 2026 కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఉచిత డిజిటల్ కోచింగ్ ప్రారంభం

(మొదటి పేజీ తరువాయి)

కూడిన నిరంతర శిక్షణ కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహించనుంది. టెట్ పేపర్-1 మరియు పేపర్-2 రాయడానికి సిద్ధమవుతున్న అభ్యర్థులందరికీ ఇది పెద్ద సహకారంగా ఉండనుంది. రోజుకు మొత్తం 4 గంటల పాటు ప్రత్యేక పాఠాలు ప్రసారం కానున్నాయి. టి-సాట్ నిపుణ చానెల్‌లో ప్రతిరోజూ సాయంత్రం 5 గంటల నుంచి 7 గంటల వరకు ప్రత్యేక తరగతులు ఉంటాయి. టి-సాట్ విద్య చానెల్‌లో ఉదయం 5 గంటల నుంచి 7 గంటల వరకు శిక్షణ అందజేయనున్నారు. ఈ రెండు భాగాల్లోనూ టెట్‌కు అవసరమైన ప్రధాన అంశాలను నిపుణులు బోధించనున్నారు. పాఠ్యాంశాలలో చైల్డ్ డెవలప్‌మెంట్ & పెడగోగీ, సైకాలజీ, ఫిజికల్




సైన్స్, బయాలజికల్ సైన్స్, గణితం, సోషల్ స్టడీస్‌తో పాటు ఇంగ్లీష్, తెలుగు మరియు ఇతర అవసరమైన సబ్జెక్టులు ఉంటాయి. టెట్ అభ్యర్థులు తమ పరీక్షా సిద్ధతలో ఈ పాఠ్యాంశాలు అత్యంత కీలకమని అధికారులు చెప్పారు. ఈ డిజిటల్ కోచింగ్ టి-సాట్ ఉపగ్రహ చానెల్‌లతో పాటు టి-సాట్ మొబైల్ యాప్, యూట్యూబ్‌లో కూడా అందుబాటులో ఉండనుంది. సాంకేతికతను ఉపయోగించి రాష్ట్రంలోని ప్రతి అభ్యర్థి నాణ్యమైన శిక్షణ పొందేలా ప్రభుత్వం ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని రూపొందించింది.

# తెలంగాణ నీటి హక్కులపై కేంద్రంలో స్పష్టత కోరిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

(మొదటి పేజీ తరువాయి)

చాలాకాలంగా పెండింగ్‌లో ఉండటాన్ని ఆయన ప్రస్తావించారు. పాలమూరు-రంగారెడ్డి లిఫ్ట్ పథకం, సమ్మక్క సాగర్‌కు సంబంధించిన అనుమతులు నెలల తరబడి ఆగిపోయాయని మంత్రి తెలిపారు. రెండు ప్రాజెక్టులూ రాష్ట్రంలోని ఎండబారిన ప్రాంతాలకు జీవనాధారంగా మారనుండగా, కేంద్రంలో జరుగుతున్న ఆలస్యం రైతుల ప్రయోజనాలపై ప్రతికూల ప్రభావం చూపుతోందని ఆయన పేర్కొన్నారు. వెంటనే అనుమతులు మంజూరు చేయాలని కేంద్రాన్ని అభ్యర్థించారు.
కృష్ణా జలాల విభజనపై బ్రిజేష్ ట్రైబ్యునల్ తీర్పు ఆలస్యమవడం వలన అనేక సాగు పథకాలు నిలిచిపోయాయని మంత్రి గుర్తుచేశారు. కృష్ణా నదీ జలాల న్యాయమైన పంచాయితీ కోసం ట్రైబ్యునల్ విచారణలను వేగవంతం చేయాలని సూచించారు. దీనివల్ల తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాల మధ్య నీటి పంపిణీ స్పష్టతగా జరిగే అవకాశం ఉందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రతిపాదించిన పోలవరం-బణకచర్ల లింక్ ప్రాజెక్టు వరద నీటిపై ఆధారపడి రూపొందించబడిందని, ఇది జాతీయ ప్రమాణాలకు విరుద్ధమని ఉత్తమ్ స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టుపై తెలంగాణకు తీవ్రమైన అభ్యంతరాలు ఉన్నాయని మంత్రి జలశక్తి మంత్రికి రాతపూర్వకంగా, ప్రత్యక్షంగా తెలిపారని వివరించారు.
అలాగే కర్ణాటక ప్రభుత్వం అల్మట్టి ప్రాజెక్టు నీటి మట్టాన్ని 519 మీటర్ల నుంచి 594 మీటర్లకు పెంచే యోచనపై తెలంగాణ బలమైన అభ్యంతరం వ్యక్తం చేసింది. అల్మట్టి ఎత్తు పెరిగితే తెలంగాణకు లభించే హక్కు నీరు తగ్గిపోతుందని మంత్రి తెలిపారు. దీనిపై కేంద్రం మధ్యవర్తిత్వం చేసి కర్ణాటకకు మార్గనిర్దేశం చేయాలని కోరారు. తెలంగాణలో సాగు విస్తరణకు,



నీటి వినియోగ హక్కుల బలపరచడానికి రాష్ట్రం సమర్పించిన పలు ప్రాజెక్టులకు కేంద్ర ఆర్థిక సహాయం అవసరమని ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పారు. ఇప్పటికే ప్రాజెక్టుల వివరాలను కేంద్రానికి అందజేసినట్లు తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి కోసం వెంటనే చర్యలు తీసుకోవాలని కేంద్రాన్ని ఆయన కోరారు.

# బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి కొత్త ఊపు

(మొదటి పేజీ తరువాయి)

విమల్‌కుమార్‌తో పాటు పలు స్థానిక కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో ఈ చేరికలు అధికారికంగా జరిగాయి.
కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరిన నేతలకు కేటీఆర్ పార్టీ కండువా కప్పి ఆహ్వానం పలికారు. వారితో మాట్లాడిన కేటీఆర్, బీఆర్ఎస్ లక్ష్యాలు, ప్రజాకేంద్రీకృత విధానాలు, అభివృద్ధి ప్రాధాన్యతను వివరించినట్లు సమాచారం. కొత్తగా చేరిన నేతలు పార్టీ కోసం పనిచేసే సంకల్పం వ్యక్తం చేశారు.
ఈ చేరికలతో శేరిలింగంపల్లి నియోజకవర్గంలో బీఆర్ఎస్ బలం మరింత పెరిగిందని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. స్థానిక స్థాయిలో కాంగ్రెస్‌కు ఎదురుదెబ్బగా ఈ పరిణామాన్ని పరిశీలిస్తున్న రాజకీయ వర్గాలు, రానున్న రోజుల్లో మరిన్ని చేరికలు ఉండే అవకాశాలున్నాయని అంచనా వేస్తున్నాయి.




# సింగరేణి భవన్ ముట్టడిలో ఉద్రిక్తత

(మొదటి పేజీ తరువాయి)

నాంపల్లిలోని సింగరేణి భవన్‌ను ముట్టడించే ప్రయత్నంలో కవితతోపాటు జాగృతి నాయకులు, హెచ్ఎంఎస్ నేతలను పోలీసులు అడ్డుకోవడంతో తోపులాట చోటుచేసుకుంది. అనంతరం కవిత సహా పలువురు నేతలను పోలీసులు అరెస్ట్ చేశారు. కవిత ఆటోలో సింగరేణి భవన్‌కు చేరుకోవడం, ఆ వెంటనే పెద్ద ఎత్తున జాగృతి కార్యకర్తలు సమీకరించుకోవడం పరిసరాల్లో ఉద్రిక్తతను పెంచింది. పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేసి ముట్టడి ప్రయత్నాన్ని నిరోధించారు. చివరికి కవితను, ఆమెతో వచ్చిన నాయకులను నాంపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఇటీవల బీఆర్ఎస్‌కు రాజీనామా చేసిన కవిత, తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలిగా ప్రజా సమస్యలపై గళం వినిపిస్తున్నారు. ఈ క్రమంలో ఆమె 'జనం బాట' కార్యక్రమాన్ని ప్రారంభించి, నవంబర్ 17న సత్తుపల్లిలోని సింగరేణి ఉపరితల బొగ్గుగనులను సందర్శించారు. డిపెండెంట్ ఉద్యోగాల ఎంపికలో భారీ అన్యాయం జరిగిందని, 54 మందిలో ముగ్గురిని మాత్రమే నియమించి మిగతా వారిని రద్దు చేయడం అన్యాయమని ఆమె విమర్శించారు. సింగరేణి కార్మికుల సమస్యలపై సీఎం రేవంత్ రెడ్డి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని కవిత మండిపడ్డారు. కాంట్రాక్ట్-అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను శాశ్వతం చేయాలని, వేజ్ బోర్డు ప్రకారం వేతనాలు చెల్లించాలని ఆమె డిమాండ్ చేశారు. అలాగే సంస్థలో సూపర్ స్పెషాలిటీ వైద్యశాల, కార్మికుల పిల్లలకు పాఠశాలలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. జాగృతి, హెచ్ఎంఎస్ ఆధ్వర్యంలో నవంబర్ 19న సింగరేణి భవన్ ముట్టడి చేస్తామని ముందే ప్రకటించడంతో, ఉదయం నుంచే భారీగా పోలీసులు మోహరించారు. కవిత అరెస్టుతో సంఘటన రాజకీయ వాతావరణంలో తీవ్ర చర్చకు దారితీసింది.



# హిడ్మా హత్యను ఎన్‌కౌంటర్‌గా చూపిస్తున్నారు

(మొదటి పేజీ తరువాయి)

ఎన్‌కౌంటర్ల అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. హిడ్మా ఆశ్రయం కోరితే తానే చూసుకునేవాడినని, అతన్ని స్వయంగా డీజీపీ వద్దకు తీసుకెళ్లి లొంగదీసే అవకాశం ఉందని తెలిపారు. అయినప్పటికీ హిడ్మాను చంపి దానిని ఎన్‌కౌంటర్‌గా చూపించడం విచారకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మావోయిస్టులతో చర్చలు జరిపి సమస్యల మూలాలు తెలుసుకోవడం ప్రభుత్వ ధర్మమని కూనంనేని సూచించారు. చంపడం పరిష్కారం కాదని, అరెస్టు చేసి చట్టం ముందు పెట్టాల్సిన అవసరం ఉందని అన్నారు. కేంద్రానికి నిజమైన చిత్తశుద్ధి ఉంటే ఈ హత్యలపై విచారణ ఆదేశించాలని ఆయన కోరారు. దేవ్‌జీ కూడా పోలీసుల చెరలో ఉన్నట్లు సమాచారం వస్తోందని, పోలీసులు అదుపులో ఉంచుకున్నవారి పూర్తి జాబితా బయటపెట్టాలని డిమాండ్ చేశారు. మరోవైపు 2026



మార్చికల్లా మావోయిజాన్ని నిర్మూలిస్తామని కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలను కూనంనేని తప్పుబట్టారు. "ఇదేమైనా యుద్ధమా?" అని ప్రశ్నిస్తూ, దండకారణ్యంలో ఉన్న విలువైన ఖనిజ సంపద కోసం మావోయిస్టులను హతమారుస్తున్నారని ఆరోపించారు. ఏకపక్ష కాల్పులను కూడా ఎన్‌కౌంటర్‌గా చిత్రీకరించడం దారుణమని బండి సంజయ్‌పై కూడా విమర్శలు గుప్పించారు. హింసను విడిచిపెట్టి శాంతియుత పరిష్కారాల దిశగా ప్రభుత్వం అడుగులు వేయాలి తప్ప ఇలాంటి చర్యలు ప్రజాస్వామ్యానికి ముప్పు అని కూనంనేని హెచ్చరించారు.

# ఇన్వెస్ట్మెంట్ స్కామ్‌లపై తెలంగాణ పోలీసు అలర్ట్

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు): వాట్సాప్ ద్వారా జరుగుతున్న పెట్టుబడి మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ పోలీసు హెచ్చరించింది. ఇటీవల రాష్ట్రంలో ఇన్వెస్ట్మెంట్ గ్రూపుల పేరుతో ప్రజలను మోసం చేసే ఘటనలు పెరుగుతున్న నేపథ్యంలో పోలీసు విభాగం ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేస్తూ కీలక సూచనలు చేసింది. లాభాలు వస్తాయంటూ చెప్పే ఆకర్షణీయ మెసేజీలకు బలవద్దని స్పష్టం చేసింది. తెలియని వాట్సాప్ గ్రూపుల్లో చేరడం అత్యంత ప్రమాదకరమని, ప్రత్యేకంగా ఇన్వెస్ట్మెంట్ టీమ్స్, టిప్స్ పేరుతో పంపే మెసేజీలను నమ్మవద్దని పోలీసులు సూచించారు. చిన్న మొత్తంలో పెట్టుబడి పెట్టితే పెద్దగా లాభాలు వస్తాయని చెబుతూ పంపే లింకులను అస్సలు క్లిక్ చేయొద్దని హెచ్చరించారు. ఈ లింకులు డేటాను దోచుకోవడం, బ్యాంకు ఖాతాలను ఖాళీ చేయడం వంటి ప్రమాదాలకు కారణమవుతాయని పోలీసు శాఖ వివరించింది. మరింత ప్రమాదకరంగా ఫైళ్లను డౌన్‌లోడ్ చేయమని పంపే లింకులు ఉంటాయని, వీటిని మొబైల్‌లో ఇన్‌స్టాల్ చేస్తే వ్యక్తిగత సమాచారం మొత్తం మోసగాళ్ల చేతుల్లో పడే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు. తెలియని వ్యక్తుల మెసేజీలు, అనుమానాస్పద లింకులు, "త్వరిత లాభాలు" అనే వాగ్దానాలను పూర్తిగా దూరంగా ఉంచాలని స్పష్టం చేశారు. ఈ తరహా మోసాలు ప్రత్యేకంగా యువత, ఉద్యోగస్తులు, చిన్న వ్యాపారులను లక్ష్యంగా చేసుకుని జరుగుతున్నాయని పోలీసులు వెల్లడించారు. ఏ రకమైన పెట్టుబడి పెట్టాలన్నా అధికారిక, నమ్మకమైన వనరులను మాత్రమే ఆశ్రయించాలని సూచించారు. మోసాలకు గురైన వారు వెంటనే సైబర్ క్రైమ్ పోర్టల్ లేదా సమీప పోలీసు స్టేషన్‌ను సంప్రదించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. వాట్సాప్ ద్వారా పెట్టుబడుల పేరుతో జరుగుతున్న మోసాలు కొత్త రూపంలో పెరుగుతున్న దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండటం అత్యంత ముఖ్యమని తెలంగాణ పోలీసు పౌరులను హెచ్చరిస్తోంది.



## ప్రజలకు అవసరమైన ప్రతి చోట మౌలిక వసతులు కల్పించడమే ప్రధాన లక్ష్యం

- **వర్ధన్నపేట ఎమ్మెల్యే కే.ఆర్ నాగరాజు**

**హాసన్ పర్తి, నవంబర్ 19(తెలంగాణ ముచ్చట్లు):**విలీన గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా ప్రతి డివిజన్ లో అభివృద్ధి పనులుకు నిధులు కేటాయించి త్వరితగతిన పూర్తి చేస్తామని ఎమ్మెల్యే నాగరాజు అన్నారు.గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 65వ డివిజన్ పరిధిలోని చింతగట్టు గ్రామ స్మశాన వాటికలో మౌలిక వసతుల అభివృద్ధి పనులకోసం బుధవారం రోజున 18లక్షల నిధులతో అభివృద్ధి పనులు ఎమ్మార్మెల్యే ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు గారు మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన ప్రతి చోట మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్మశాన వాటికలు కూడా ప్రజా జీవనంలో ఒక ముఖ్యమైన భాగమని ఇక్కడికి వచ్చే ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా నీరు, విద్యుత్, కూర్చునే సదుపాయం, షెడ్లు, టాయిలెట్లు వంటి అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేస్తామని అన్నారు.అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేస్తామని ప్రజల సమస్యలు విని పరిష్కరించడం నా బాధ్యత అని అందరి ఆశీర్వాదాలతో మరింత అభివృద్ధి సాధించడానికి కృషి చేస్తానుని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.



## అభివృద్ధి పనులపై జిహెచ్ఎంసి కమిషనర్‌కి వినతిపత్రం కార్పొరేటర్

**నాచారం, నవంబర్ 19 (తెలంగాణ ముచ్చట్లు):**నాచారం డివిజన్‌లో పురోగతిలో ఉన్న పలు అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ బుధవారం జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి కర్ణన్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఆయన కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు.రైతు బజార్ పక్కన ఉన్న ప్రభుత్వ స్థలంలో మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్ నిర్మాణం, అన్నపూర్ణ కాలనీకి ఆనుకుని ఉన్న హెచ్ఎంటీ నగర్ పెద్ద చెరువు బఫర్ జోన్‌లో థీమ్ పార్క్ ఏర్పాటు, ఎర్రకుంట హిందూ స్మశానవాటికను వైకుంఠధామంగా అభివృద్ధి చేయడం వంటి కీలక విషయాలను కార్పొరేటర్ కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. అదనంగా, పటేల్‌కుంట చెరువు పక్కన కోటి 80 లక్షల రూపాయల వ్యయంతో చేపట్టిన సీవరేజ్ లైన్ డైవర్షన్ పనులు ఇంకా పది శాతం మాత్రమే మిగిలి ఉన్నందున వాటిని త్వరగా పూర్తి చేయాల్సిందిగా కోరారు.ప్రతిపాదించిన అన్ని అభ్యర్థనలను సానుకూలంగా పరిశీలిస్తామని కమిషనర్ ఆర్.వి కర్ణన్ హామీ ఇచ్చారు. సంబంధిత సమస్యలపై వెంటనే చర్యలు తీసుకోవాలని జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పటేల్‌కు ఫోన్ ద్వారా సూచించారు.



## అభివృద్ధి పనులపై జిహెచ్ఎంసి కమిషనర్‌కి వినతిపత్రం కార్పొరేటర్

- **రైల్వే మ్యాన్ ఫ్యాక్టరింగ్ పనులను పరిశీలించిన ఎంపీ కావ్య, ఎమ్మెల్యే నాగరాజు**

**కాజీపేట నవంబర్ 19 (తెలంగాణ ముచ్చట్లు):** వచ్చే సంవత్సరం మార్చి నెలలో ప్రారంభం కానున్న కాజీపేట లోని మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్ పనులను బుధవారం వరంగల్ ఎంపీ డాక్టర్ కావ్య వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు పరిశీలించారు. యూనిట్ లో జరుగుతున్న పనుల పురోగతి మౌలిక వసతుల అభివృద్ధి విభాగల వారీగా జరుగుతున్న నిర్మాణ కార్యకలాపాలపై ఆ ఇద్దరు ప్రజాప్రతినిధులు రైల్వే అధికారుల తో సమీక్షించారు. ఈ సందర్భంగా కావ్య మాట్లాడుతూ కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ మార్చి నెల ప్రారంభంతో తెలంగాణ ప్రజల 30 ఏళ్ల కల త్వరలో నెరవేరబోడుతుందని అన్నారు. కాంగ్రెస్ పాలలోనే ఇది సాధ్యమైందని, ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనం అని ఆమె పేర్కొన్నారు. భూములు కోల్పోయిన వారికి అన్యాయం జరగకుండా చూస్తామన్నారు. స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. గతంలో అదే అంశంపై కేంద్ర రైల్వే శాఖ మంత్రిని కలిసి కోరానని ఆమె వెల్లడించారు. రైల్వే యూనిట్లో స్థానికుల ఉద్యోగాలు కల్పించే అంశంపై పార్లమెంట్లో సైతం తన గళం వినిపించానని ఆమె స్పష్టం చేశారు. ప్రస్తుతం మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్ మార్చి నెలలో ప్రారంభమవుతుందని అన్నారు. ప్రతి ఏడాది 600 ల కోచ్ లను ఇక్కడ సిద్ధం చేస్తారని ఆమె తెలిపారు. అభివృద్ధి పనులను జాప్యం జరగకుండా చూడాలని అధికారులకు కావ్య సూచించారు. అనంతరం రైల్వే అధికారులు మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్ వివరాలను ఎంపీ కి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులతో పాటు సీఎం ఆనంద్, మురళీకృష్ణ, డిజీఎం శర్మ ఇతర అధికారులు పాల్గొన్నారు.





# నాగారం ప్రభుత్వ పాఠశాలలో నశా ముక్త్ భారత్ ప్రతిజ్ఞ కార్యక్రమం

**నాగరం, నవంబర్ 19 (తెలంగాణ ముచ్చట్లు):** “నశా ముక్త్ భారత్ అభియాన్” కార్యక్రమంలో భాగంగా జెడ్ పిహెచ్ఎస్ నాగరం పాఠశాలలో మాదక ద్రవ్యాల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి మత్తు పదార్థాల ఉపయోగాన్ని పూర్తిగా నిరోధించే దిశగా ప్రతిజ్ఞ చేశారు.ఈ కార్యక్రమంలో నాగరం మునిసిపల్ కమిషనర్ ఎస్. భాస్కర్ రెడ్డి, మేనేజర్ బి. నారాయణ రెడ్డి, వార్డు అధికారులు, యుఎల్‌బి సిబ్బంది పాల్గొన్నారు. నశా ముక్త్ భారత్ లక్ష్య సాధనకు విద్యార్థులు, ప్రజలు కలిసి ముందుకు రావాలని కమిషనర్ పిలుపునిచ్చారు. మత్తు పదార్థాలు వ్యక్తి ఆరోగ్యాన్ని, కుటుంబ స్థిరత్వాన్ని, సమాజ శాంతిని దెబ్బతీసే ప్రమాదం ఉన్నందున వాటి నుంచి పూర్తిగా దూరంగా ఉండాలని ఆయన సూచించారు. మత్తుమందుల రహిత సమాజ నిర్మాణానికి ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు చేపట్టిన ఈ కార్యక్రమానికి విద్యార్థులు, ఉపాధ్యాయులు చురుకైన స్పందన చూపించారు. ఈ తరహా అవగాహన కార్యక్రమాలు మరింత విస్తృతంగా జరగాల్సిన అవసరం ఉందని నిర్వాహకులు అభిప్రాయపడ్డారు.





# ప్రతి విద్యార్థికి పర్యావరణంపై అవగాహన కల్పించాలి

- **కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ చైర్మన్ లక్ష్మారెడ్డి**

**సత్తుపల్లి, నవంబర్ 19 (తెలంగాణ ముచ్చట్లు):**ప్రతి విద్యార్థిలో పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించడం అత్యంత అవసరమని కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ చైర్మన్ లక్ష్మారెడ్డి అన్నారు. భవిష్యత్ తరాలకు కలుషితం లేని ప్రకృతిని అందించేందుకు ఇప్పుడే చర్యలు ప్రారంభించాలన్నారు.

స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో బుధవారం డిపార్ట్మెంట్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్, కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్, నాబార్డ్ సంయుక్తంగా నిర్వహిస్తున్న యంగ్ ఎర్త్ లీడర్స్ కార్యక్రమంలో భాగంగా మెడిసన్ గార్డెన్, కిచెన్ గార్డెన్, వాటర్ హార్వెస్టింగ్ పిట్, కంపోస్ట్ పిట్, జనరల్ ప్లాంటేషన్ ప్రారంభోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆడిషనల్ డైరెక్టర్ శ్రీనివాస చారి, ఏయంఓ ప్రభాకర్ రెడ్డి, కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ చైర్మన్ లక్ష్మారెడ్డి, యంగ్ ఎర్త్ లీడర్స్ రాష్ట్ర కోఆర్డినేటర్ యానాల వెంకట్ రెడ్డి, సత్తుపల్లి మండల విద్యాధికారి ఎన్. రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. మాట్లాడిన వారు పేర్కొంటూ, “మా తరం వారు కలుషితం లేని ప్రకృతిని చూశాం. కానీ నేటి పరిస్థితుల్లో భూమి, నీరు, గాలి, చివరికి మనం తినే ఆహారం కూడా కలుషితమై ప్రజల ప్రాణాలు తీసేస్తున్నాయి. నేటి బాలలే రేపటి పౌరులు. మంచి ప్రకృతిని భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత మీపై ఉంది” అని విద్యార్థులకు సూచించారు. ప్రతి విద్యార్థి తమ పుట్టినరోజు సందర్భంగా ఒక మొక్క నాటి, ఇక సంవత్సరం తర్వాత మొక్కకు కూడా పుట్టినరోజు జరుపుతూ సమాజానికి ఆదర్శంగా నిలవాలని సూచించారు. అలాగే ప్రతి రక్షాబంధన్ రోజున ‘వృక్షాబంధన్’ చేసి, ఒక చెట్టును కుటుంబ సభ్యుడిగా గుర్తించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మెడిసన్ గార్డెన్, కిచెన్ గార్డెన్, వాటర్ హార్వెస్టింగ్ పిట్, కంపోస్ట్ పిట్, జనరల్ ప్లాంటేషన్‌ల వినియోగాలు, ప్రాధాన్యతను పిల్లలకు వివరించారు.

కార్యక్రమంలో పుడమి సంపాదకులు రమేష్‌రావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎన్. నాగేశ్వరరావు, మెంటార్ టీచర్ శ్రీదేవి, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినులు, ఎర్త్ లీడర్స్, సిజీఆర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కోటి మహిళలకు కోటి ఇందిరమ్మ చీరలు పంపిణీ ప్రారంభం

- **పారదర్శకతతో నిర్వహించాలని సీఎం ఆదేశాలు**





**మేడ్చల్–మల్కాజిగిరి కలెక్టర్, నవంబర్ 19 (తెలంగాణ ముచ్చట్లు):** ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా కోటి మంది మహిళలకు కోటి ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రారంభించింది. తెలంగాణ సంప్రదాయంలో భాగంగా ఆడబిడ్డలకు చీరను అందించే ఆచారాన్ని కొనసాగించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో తెలిపారు.ప్రతి నియోజకవర్గానికి ఓ ప్రత్యేక అధికారిని నియమించి, మండల కేంద్రాల్లో పండగ వాతావరణంలో చీరల పంపిణీ జరగాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నవంబర్ 19 నుంచి డిసెంబర్ 9 వరకు, పట్టణ ప్రాంతాల్లో మార్చి 1 నుంచి 8 వరకు ఇందిరమ్మ చీరల పంపిణీ కొనసాగనున్నట్లు వివరించారు.మహిళలకు ఉచిత ఆర్టీసీ ప్రయాణం, యూనిఫాం కుట్టుపని బాధ్యతను మహిళా సంఘాలకు అప్పగించడం, ఇందిరమ్మ క్యాంటీన్లు, శిల్పారామంలో 3 ఎకరాల్లో ‘ఇందిరా మహిళా శక్తి బజార్’ ఏర్పాటు వంటి పలు మహిళా సంక్షేమ కార్యక్రమాలు చేపట్టినట్లు సీఎం వెల్లడించారు. మహిళల తయారీ ఉత్పత్తులకు జాతీయ-అంతర్జాతీయ గుర్తింపు తీసుకురావడమే కాక, కోటి మహిళలను కోటీశ్వరులుగా మార్చడం లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు.చీరల పంపిణీ ప్రక్రియలో ఏ విధమైన వివాదాలకు తావు లేకుండా పారదర్శకంగా నిర్వహించాలని అన్ని జిల్లా కలెక్టర్లను సీఎం ఆదేశించారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, వాకాటి శ్రీహరి, సలహాదారు వేం. నరేందర్ రెడ్డి, సీఎస్ రామకృష్ణారావు, వివిధ జిల్లాల కలెక్టర్లు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా తరపున కలెక్టర్ మనుచౌదరి, అదనపు కలెక్టర్లు రాధికా గుప్తా, విజయేందర్ రెడ్డి, డీఆర్డీఓ సాంబశివరావు, మున్సిపల్ కమిషనర్లు, మహిళాశక్తి సంఘ సభ్యులు పాల్గొన్నారు.

# గంజాయి కేసులో ఇద్దరికి 20 ఏండ్ల జైలు శిక్ష... ఒక్కొక్కరికి లక్ష జరిమానా

- **మొదటి అదనపు జిల్లా మరియు సెషన్స్ కోర్టు తీర్పు**
- **ప్రాసిక్యూషన్ కు సహకరించిన అధికారులను అభినంధించిన పోలీస్ కమిషనర్**

**ఖమ్మం బ్యూరో, నవంబర్ 19, తెలంగాణ ముచ్చట్లు:** గంజాయి తరలిస్తూ పట్టుబడిన ఇద్దరికి 20 ఏండ్ల చొప్పున కఠిన కారాగార శిక్షతో పాటు ఒక్కొక్కరికి లక్ష చొప్పున జరిమాన విధిస్తూ.. మొదటి అదనపు జిల్లా మరియు సెషన్స్ కోర్టు న్యాయమూర్తి కె. ఉమాదేవి తీర్పు వెల్లడించారు. ప్రాసిక్యూషన్ కు సహకరించిన అధికారులను అభినందించిన పోలీస్ కమిషనర్ సునీల్ దత్...

ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. జల్సాలకు అలవాటు పడి, అక్రమార్జన కోసం సీలేరు నుండి తీసుకొచ్చిన గంజాయి కొణిజర్ల మండలం, గద్దలగూడెం గ్రామ శివారులోని పొలాలలో నిలువచేసి 2020 డిసెంబర్ 4 న సుమారు 50 కేజీల గంజాయిని ఇతర ప్రాంతాలకు ఆటోలో తరలిస్తున్న క్రమంలో కొణిజర్ల పోలీసులకు ఇద్దరు నిందుతులు 1) తమ్మిశెట్టి ఆనంద్ 29సం, (తల్లాడ గ్రామం గద్దలగూడెం, కొణిజర్ల మండలం.) 2) గుగులోతు బావసింగ్ @ శంకర్ (కొమ్ముగూడెం గ్రామం జూలూరు పాడ్ మండలం) పట్టుపడ్డారు. కొణిజర్ల పోలీస్ స్టేషన్ లో ఎన్ డి పి ఎస్ యాక్ట్ , 1985 చట్టం కింద కేసు నమోదు చేసిన పోలీసులు సమగ్ర దర్యాప్తు అనంతరం కోర్టులో అభియోగపత్రం దాఖలు చేశారు. పరిశీలించిన న్యాయమూర్తి.. నిందితులపై మోపిన అభియోగం రుజువు కావటంతో పైవిధంగా తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కు సహకరించిన విచారణ అధికారలు అప్పటి ఇన్స్పెక్టర్ వసంత కుమార్, ప్రస్తుత ఇన్స్పెక్టర్ అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ,జె. శరత్ కుమార్ రెడ్డి, ఎస్సై మొగిలి, కోర్టు కానిస్టేబుల్ రామారావు, కోర్టు లైజనింగ్ కె.శ్రీకాంత్ (ఎస్సై) హెడ్ కానిస్టేబుల్ మల్లికార్జున రావు, శ్రీనివాస్,నాగేశ్వరారావు, హోంగార్డ్ ఆఫీసర్ ఎండీ.ఆయూబ్ ప్రాసిక్యూషన్ కు సహకరించిన అధికారులను అభినందించి నపోలీస్ కమిషనర్ సునీల్ దత్...

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# మృతిని కుటుంబానికి ఆర్థిక సహాయం

**చర్లపల్లి,నవంబర్ 19,(తెలంగాణ ముచ్చట్లు):** చర్లపల్లి డివిజన్ కి చెందిన ఇంద్రాల రాజు ( 36) అనారోగ్యంతో సోమవారం మృతిచెందగా విషయం తెలుసుకున్న ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆదేశాల మేరకు బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు నేమూరి మహేష్ గౌడ్ వెంటనే వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం వారి కుటుంబానికి రూ. 10వేల రూపాయలు ఆర్థిక సాయం అందించారు.చిన్న వయసులోనే రాజు చనిపోవడం బాధాకరం నేమూరి మహేష్ గౌడ్ అన్నారు.మృతునికి ఇద్దరు కుమారులు,ఒక కుమార్తె ఉన్నారు.అంత్యక్రియలకు సహాయం అందించడం పట్ల కుటుంబ సభ్యులు నేమూరి మహేష్ గౌడ్ కు కృతజ్ఞతలు తెలిపారు.



# నిరుపేదల అభ్యున్నతికి పాటుపడిన ఉక్కు మహిళ స్వర్గీయ ఇందిరాగాంధీ

- **ఇందిరా గాంధీకి వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి నివాళులు**

**వనపర్తి,నవంబర్19(తెలంగాణ ముచ్చట్లు):** భారతదేశపు మొట్టమొదటి మహిళా ప్రధానమంత్రి స్వర్గీయ ఇందిరా గాంధీ దేశ అభివృద్ధి కోసం ఎన్నో సంస్కరణలు చేపట్టి, నిరుపేదల అభ్యున్నతికి వెన్నుదన్నుగా నిలిచిన ఉక్కు మహిళగా పేరుగాంచారని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి తెలిపారు. ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా బుధవారం వనపర్తి పట్టణంలోని ఇందిరా పార్క్ లో ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఎమ్మెల్యే మేఘారెడ్డి మాట్లాడుతూ.. స్వర్గీయ ప్రధానమంత్రి గరిబి హటావో ఉద్యమం ద్వారా భూమిలేని నిరుపేదలకు సాగు భూములను అందించి, నిరుపేదల అభ్యున్నతికి కృషి చేసినారన్నారు. అలాగే, బ్యాంకులను జాతీయకరణ చేసి, నిరుపేదలకు బ్యాంకు సేవలను అందుబాటులో తెచ్చారని గుర్తు చేశారు.అంతేకాక, హరిత విప్లవం తీసుకొచ్చి పంటల దిగుబడిని పెంచి అన్నదాతల శ్రేయస్సు కోసం కృషి చేసినారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఇందిరా గాంధీ కుటుంబం పూర్తిగా ప్రజా సేవకై ప్రాణాలర్పించారని కూడా ఆయన తెలిపారు.మేఘారెడ్డి తెలిపారు, ధీరశాలి అయిన స్వర్గీయ ఇందిరా గాంధీ ఆశయాల సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రజలను ప్రేరేపించారు.ఈ కార్యక్రమంలో వనపర్తి వ్యవసాయ మార్కెట్ యార్డ్ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, వనపర్తి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చీర్ల విజయ్ చందర్, మాజీ మున్సిపల్ చైర్మన్ పుట్టపాకుల మహేష్, మాజీ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# స్నేహితుల వేధింపులకు భయపడి యువకుడు ఆత్మహత్య



**జవహర్ నగర్, నవంబర్ 19 (తెలంగాణ ముచ్చట్లు):** జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో బాలాజీ నగర్ శ్రీరామ్ నగర్ కాలనీకి చెందిన కట్టా సందీప్ (25) ఆత్మహత్యా ప్రయత్నంలో ప్రాణాలు కోల్పోయిన ఘటన చోటు చేసుకుంది.గతంలో చెడు వ్యసనాలకు అలవాటు పడ్డ సందీప్, ఇటీవలి కాలంలో అవన్నీ మానుకుని ఉద్యోగం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అయితే ఇదే విషయాన్ని అతని స్నేహితులు బాలరాజు మరియు సంతోష్ నగర్కు చెందిన హరీష్ కుమార్ సహించలేదని పోలీసుల దర్యాప్తులో బయటపడింది.పోలీసుల సమాచారం ప్రకారం—నిందితులు సందీప్‌ను తిరిగి మత్తు పదార్థాలకు అలవాటు చేయడానికి గత కొద్ది కాలంగా ప్రతి రోజు ఉదయం 4 గంటలకు తీసుకెళ్లి, సాయంత్రం 8 గంటల వరకు తమ వద్దే ఉంచేవారని, పనికి వెళ్లకుండా అడ్డుకున్నారని తెలుస్తోంది. దొంగతనాలకు రావట్లేదని, మందు తాగడానికి బయటికిరావట్లేదని పలుమార్లు బెదిరించడంతో పాటు శారీరకంగా వేధించినట్లు తెలిసింది.ఈ నెల 17న సాయంత్రం 8 గంటల సమయంలో శ్రీరామ్ నగర్ కాలనీ ఖాళీ ప్రదేశంలో బాలరాజు, హరీష్ కుమార్ కలిసి సందీప్‌పై దాడికి తెగబడ్డారు. తీవ్రంగా కొట్టిన అనంతరం ఇంటికి చేరిన సందీప్ జరిగిన విషయాన్ని తన తల్లి కవితకు తెలిపాడు. వారు తనను నిరంతరం మద్యం తాగమని ఒత్తిడి చేస్తున్నారని, రావట్లేదని చంపేస్తామని బెదిరిస్తున్నారని పేర్కొన్నాడు.మానసిక ఆందోళనకు గురైన సందీప్ అదే రోజు రాత్రి సుమారు 10 గంటల సమయంలో బ్లేడ్ మరియు కత్తితో తన గొంతు కోసుకున్నాడు. వెంటనే అతన్ని ఆసుపత్రికి తరలించినా మార్గమధ్యంలోనే మృతి చెందాడు.ఈ ఘటనపై సందీప్ తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు, నిందితులు కట్టా బాలరాజు మరియు హరీష్ కుమార్‌ను అదుపులోకి తీసుకుని, రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

# వెల్టూర్ వద్ద జాతీయ రహదారిలో రోడ్డు ప్రమాదాల భయం





**పెద్దమందడి,నవంబర్19(తెలంగాణ ముచ్చట్లు):** పెద్దమందడి మండలం వెల్టూర్ గ్రామం సమీప జాతీయ రహదారిపై జరుగుతున్న బ్రిడ్జి నిర్మాణ పనులు స్థానిక ప్రజల్లో భయాందోళన కలిగిస్తున్నాయి. నిర్మాణ ప్రాంతంలో రోడ్డు ప్రమాదాలు తరచుగా చోటు చేసుకోవడం వల్ల గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.బుధవారం బలీద్ బలి గ్రామానికి చెందిన హనుమంతు రెడ్డి అనే వ్యక్తి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా కారు ఢీకొని రోడ్డు ప్రమాదానికి గురై తీవ్ర గాయాల పాలయ్యారు. గాయపడ్డ హనుమంతు రెడ్డిని చికిత్స నిమిత్తం అంబులెన్స్ లో ఆస్పత్రికి తరలించడం జరిగింది.ఈ ఘటన తర్వాత స్థానికులు మరింత భయాందోళనకు గురయ్యారు.బ్రిడ్జి నిర్మాణ ప్రాంతంలో రోడ్డు భద్రతా సూచికలు, హెచ్చరికా బోర్డులు సరైన విధంగా అమర్చకపోవడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని వారు తెలిపారు. ప్రజలు డిమాండ్ చేస్తూ, నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేసి, రోడ్డు భద్రతా సూచికలు మరియు వేగ పరిమితి ఏర్పాటు చేయడం ద్వారా వారి ప్రాణాలను కాపాడాలని కోరుతున్నారు.

# ఘనంగా అయ్యప్పస్వామి మహాపడిపూజ





**కీసర నవంబర్ 19 (తెలంగాణ ముచ్చట్లు)** : మేడ్చల్ జిల్లా దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోని వన్నిగూడ గ్రామంలో అయ్యప్ప స్వామి మహా పడిపూజ భక్తిశ్రద్ధల మధ్య కన్నులపండుగగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మల్లారెడ్డి హాస్పిటల్ హెల్త్ సిటీ చైర్మన్ చామకురా భద్రా రెడ్డి హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. కేరళ తాంత్రి బ్రహ్మశ్రీ ప్రదీప్ కుమార్ గురుస్వామి, నల్ల బాల్ రెడ్డి గురుస్వాముల ఆధ్వర్యంలో జరిగిన ఈ పూజల్లో అయ్యప్ప మండలదీక్ష పుణుకున్న భక్తులు మాల ధారణ చేసి స్వామివారికి అభిషేకాలు, పుష్పాభిషేకం నిర్వహించారు. భజన సంకీర్తనలు, స్వామివారి ఊరేగింపుతో వన్నిగూడా గ్రామం శోభాయమానంగా మారింది.అయ్యప్పస్వామి అభిషేక ప్రియుడిని, భజన సంకీర్తనలతో భక్తులను పారవశ్యానికి గురిచేసే కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అనంతరం మహా పడిని వెలిగించి అయ్యప్ప స్వాములకన్న సంతర్పణ నిర్వహించారు.ఈ మహా పడిపూజకు వివిధ రాజకీయ పార్టీల నాయకులు, అయ్యప్ప మాలదారులు, ప్రాంతీయ భక్తులు భారీగా పాల్గొన్నారు. స్వామియే శరణం అయ్యప్ప అంటూ మారుమ్రోగిన వన్నిగూడా ఆధ్యాత్మిక వాతావరణం భక్తులను ఉర్రూతలూగించింది.

# కోలాహలంగా నాయి బ్రాహ్మణుల వనసమారాధన






- 5 వేల మందితో నాయి బ్రాహ్మణుల ఐక్యత వర్ధిల్లింది
- విద్య, ఉద్యోగ, ఉపాధి, రాజకీయ రంగాలలో ఈ ఐక్యతను చాటాలి
- రిటైర్డ్ డీజీపీ పూర్ణ చందర్ రావు
- నాయి బ్రాహ్మణ సేవా సంఘం ఐక్యవేదిక నగర అధ్యక్షులు యలమందల జగదీష్

**ఖమ్మం బ్యూరో, నవంబర్ 18, తెలంగాణ ముచ్చట్లు;** నాయి బ్రాహ్మణుల వనసమారాధన కోలాహలంగా జరిగింది. ఖమ్మం నగరంలోని చెరుకూరి వారి మామిడితోటలో 'ఖమ్మం జిల్లా నాయి బ్రాహ్మణ సేవా సంఘం ఐక్యవేదిక' ఆధ్వర్యంలో మంగళవారం నాడు నాయి బ్రాహ్మణులు వనసమారాధన వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నాయి బ్రాహ్మణ వనసమారాధన కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా రిటైర్డ్ డిజిపి పూర్ణ చందర్ రావు, రిటైర్డ్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ దుగ్యాలా అశోక్, బీసీ జేఏసీ నాయకులు దేవరకొండ సైదులు, ఆలిండియా బీసీ స్టూడెంట్ ఫెడరేషన్ యూనివర్సిటీ చైర్మన్ గౌడ కిరణ్ కుమార్, నాయి బ్రాహ్మణ సేవా సంఘం ఐక్యవేదిక నగర అధ్యక్షులు యలమందల జగదీష్ లు పాల్గొని ప్రసంగించారు. ఈ వేడుకలకు ఉమ్మడి ఖమ్మం జిల్లా నలుమూలల నుండి నాయి బ్రాహ్మణులు 5 వేల మందికి పైగా రావడం ఐకమత్యానికి నిదర్శనమన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని నాయి బ్రాహ్మణులందరూ ఒక కుటుంబంగా ఒకే వైదికపైకి తీసుకురావడం గొప్ప అనుభూతి నిచ్చిందన్నారు. ఇది భవిష్యత్తు తరాలకు ఆదర్శంగా నిలవాలన్నారు. పిల్లలు, మహిళలు, యువత పాటలు, ఆటలు, కేరింతలతో సరదాగా గడిపే ఈ మధుర క్షణాలు తమ తరాల వారసులకు శాశ్వతంగా గుర్తుండాలన్నారు.ముఖ్యంగా నాయి బ్రాహ్మణులు విద్య, ఉద్యోగ, ఉపాధి, రాజకీయ, సేవా రంగాల్లో ఐకమత్యంతో ముందుకు నడవాలని పిలుపునిచ్చారు. అనాదిగా కులవృత్తితో సమాజ సేవా కార్యక్రమాల్లో ఉంటున్నప్పటికీ అవకాశం ఉన్నంత వరకు రాజకీయ నాయకులుగా, పాలకులుగా ఎదిగినప్పుడే నాయి బ్రాహ్మణ సమాజం అభివృద్ధి చెందుతుందని అన్నారు. ఈ వనసమారాధనలో ఉద్యోగస్థులు, రిటైర్డ్ ఉద్యోగులు, వ్యాపారస్థులు, వృత్తిదారులు, చిన్నా పెద్దా తారతమ్యం లేకండా ఆడి పాడారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని నాయి బ్రాహ్మణులు కుటుంబ సమేతంగా తరలివచ్చి విజయవంతం చేసినందుకు సంతోషంగా ఉందని, ఆధ్యాత్మికత, ఆహ్లాదం, ఐక్యమత్యంగా ఉండటం వలన ఈ కార్యక్రమం విజయవంతం అయిందన్నారు. ఈ సంవత్సరం మొదలుకొని ప్రతి సంవత్సరం జరిగే వనమహోత్సవాలు నాయి బ్రాహ్మణుల అభివృద్ధికి వేదికవ్వాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం నగర అధ్యక్షులు, ఎలక్ట్రానిక్ మీడియా నగర అధ్యక్షులు యలమందల జగదీశ్, సంఘం జిల్లా అధ్యక్షులు నంద్యాల నర్సింహారావు, జిల్లా సెక్రటరీ రావులపాటి శ్రీనివాసరావు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కొలిపాక బాబురావు, కుదురుపాటి వెంకటేశ్వరరావు, దుర్గయ్య, చాగంటిపాటి వాసు, సూత్రపు రాంబాబు, రాచమళ్ళ అభి, గుండ్లపల్లి శ్రీనివాస్, నగర ప్రధాన కార్యదర్శి సురభి సైదులు, నగర గౌరవ అధ్యక్షులు నంద్యాల రాము తదితరులు పాల్గొన్నారు.

# మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి వేడుకలు

- **దేశ అభివృద్ధిలో ఇందిరమ్మ సేవలు మరువలేనివి**



**సత్తుపల్లి, నవంబర్ 19 (తెలంగాణ ముచ్చట్లు):-** దేశ అభివృద్ధికి బంగారు బాటలు వేసిన భారత తొలి మహిళా ప్రధానమంత్రి స్వర్గీయ ఇందిరా గాంధీ జయంతిని పురస్కరించుకుని సత్తుపల్లి పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు మట్టా దయానంద్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో సత్తుపల్లి ఏఎంసీ చైర్మన్ దోమ ఆనంద్, పట్టణ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు గాదె చెన్నారావు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ తోట సుజలా రాణి, మాజీ కౌన్సిలర్ దూదిపాల రాంబాబు, సీనియర్ నాయకులు కమల్ పాషా, ఐ.శ్రీను, పెంగిలి సామెలు, మహిళా నాయకులు కుమారి, సరోజినీ తదితరులు పాల్గొన్నారు.అలాగే సత్తుపల్లి పట్టణ, మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, యువజన కాంగ్రెస్ సభ్యులు, స్థానిక ప్రజలు పాల్గొని ఇందిరమ్మ సేవలను స్మరించుకున్నారు.

తెలంగాణ TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక





# మల్కాజ్గిరి జిల్లా ఆసుపత్రినీ సందర్శించిన రాధికా గుప్తా

- వెల్టూర్ జాతీయ రహదారిపై బ్రిడ్జి నిర్మాణ పనులు నత్తనడక... ప్రజలు ఇబ్బందులు

**పెద్దమందడి,నవంబర్19(తెలంగాణ ముచ్చట్లు):** పెద్దమందడి మండలం వెల్టూర్ గ్రామం వద్ద జాతీయ రహదారి పై చేపట్టిన బ్రిడ్జి నిర్మాణ పనులు నత్తనడకన సాగుతుండటంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పనులు మధ్యలోనే ఆగిపోవడంతో రాకపోకలకు సమస్యలు తలెత్తాయని గ్రామానికి చెందిన నక్కల భాస్కర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తరచూ రోడ్డు ప్రమాదాలకు జరుగుతున్నాయని, నిర్మాణం కోసం రోడ్డును తవ్వి కంకర వేయడంతో వాహనదారులు, ప్రయాణికులు రోజువారీగా ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో పనులు మందగించడం మాత్రమే కాక, నిర్మాణ ప్రదేశంలో ఎటువంటి రోడ్డు భద్రత , ప్రమాద సూచికలు అమర్చకపోవడం వల్ల రాత్రి వేళల్లో ప్రమాదాల జరిగే అవకాశాలు ఎక్కువయ్యాయని భాస్కర్ పేర్కొన్నారు.ప్రజల సౌకర్యార్థం వెంటనే పనులను వేగవంతం చేసి బ్రిడ్జి నిర్మాణాన్ని పూర్తి చేయాలని ఆయన డిమాండ్ చేశారు. పక్కనే ఉన్న కనిమేట వద్ద నిర్మిస్తున్న బ్రిడ్జి పనులు వేగంగా సాగుతుండగా, వెల్టూర్ వద్ద మాత్రం పూర్తిగా నిలిచిపోయాయని, దీని వల్ల దుమ్ము, ధూళితో, రాత్రి వేళలోనూ సమస్యలు మరింతగా ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నాయని అన్నారు. దాదాపు 6 గ్రామాల ప్రజలకు సెంటర్ గా ఉన్న ఈ ప్రదేశంలో నిత్యం ప్రజలు అవస్థలు పడుతున్నారన్నారు. ముఖ్యంగా స్థానిక నాయకులు దీనిపై ప్రజల తరపున నిలిచి స్పందించకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు.



# రూ. 40 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి

ఉభయ జిల్లాల్లో 125 మందికి లబ్ధి

**ఖమ్మం బ్యూరో, నవంబర్ 19, తెలంగాణ ముచ్చట్లు;** ప్రైవేట్, కార్పొరేట్ హాస్పిటళ్లలో అత్యవసర వైద్య చికిత్స పొందిన పేదలను ఆర్థికంగా ఆదుకునేందుకు.. తన సిఫారసుతో మంజూరైన 125 సిఎంఆర్ఎఫ్ చెక్కులను ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి బుధవారం నగరంలోని గట్టయ్య సెంటర్ లో గల క్యాంప్ కార్యాలయంలో పంపిణీ చేశారు. తద్వారా.. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల లబ్ధిదారులకు రూ.40లక్షల మేరకు లబ్ధి చేకూరింది. ఈ సందర్భంగా ఎంపీ రఘురాం రెడ్డి మాట్లాడుతూ.. పేదల ఆరోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం భరోసాగా నిలుస్తోందని అన్నారు. అత్యవసర వైద్య చికిత్సల కోసం ఇప్పటికే అనేకమందికి ఎల్ ఓ సి లు మంజూరు చేసామని పేర్కొన్నారు. అర్హులైన పేదలందరికీ.. ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి లబ్ది కలిగేలా కృషి చేస్తానని అభయమిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్లు మానుకొండ రాధాకిషోర్, మద్ది మల్లారెడ్డి, కాంగ్రెస్ జిల్లా నాయకులు కొప్పుల చంద్రశేఖర్, టీపీసీ సభ్యులు ఉమ్మినేని కృష్ణ, ఇమామ్ భాయ్, పలువురు కార్పొరేటర్లు, ప్రజా సంఘాల బాధ్యులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# భగవద్గీత పఠనంలో మౌనిక అసమాన ప్రతిభ

- బంగారు పతకం దక్కించుకున్న బేతుపల్లి యువతి

**సత్తుపల్లి, నవంబర్ 19 (తెలంగాణ ముచ్చట్లు):** భగవద్గీత పఠనంలో తన అసాధారణ ప్రతిభను చాటుకున్న బేతుపల్లి గ్రామానికి చెందిన వేణునూతల మౌనిక బంగారు పతకాన్ని కైవసం చేసుకుంది. అంకమ్మతల్లి ఆలయ అర్చక స్వామి ధర్మపత్ని అయిన మౌనిక గీతలోని 18 అధ్యాయాలకు చెందిన మొత్తం 700 శ్లోకాలను కంఠస్థం చేసి అందరినీ ఆకట్టుకుంది.

ఇటీవల ఆన్‌లైన్‌లో నిర్వహించిన పోటీలో పాల్గొన్న ఆమె ప్రథమ స్థానం సాధించి బంగారు పతకాన్ని గెలుచుకుంది. ఈ పతకాన్ని త్వరలో మైసూరు దత్త పీఠాధిపతి సచ్చిదానంద స్వామి చేతుల మీదుగా స్వీకరించనున్నట్లు మౌనిక పేర్కొంది.



తన విజయాన్ని గురువు మాడుగుల రమ్యకు అంకితం చేస్తున్నట్లు ఆమె తెలిపింది. మౌనిక సాధించిన ఈ విజయంపై బేతుపల్లి గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

# భారత దేశ తొలి మహిళా ప్రధాని ఇందిరా గాంధీ

- జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్
- ముఖ్య అతిథిగా పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురామిరెడ్డి పాల్గొన్నారు

**ఖమ్మం బ్యూరో, నవంబర్ 19, తెలంగాణ ముచ్చట్లు;** భారత దేశంలో తొలి మహిళా ప్రధాని గా ఇందిరా గాంధీ ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చారని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్,పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురామిరెడ్డి అన్నారు. బుధవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయం సంజీవరెడ్డి భవనంలో ఇందిరా గాంధీ జయంతిని పురస్కరించుకుని ఆమె చిత్ర పటానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇందిరా గాంధీ సేవలను కొనియాడారు. నాటి నుండి కూడా కాంగ్రెస్ పార్టీ మహిళా సాధికారతకు కట్టుబడి ఉందని అందులో భాగంగానే నేడు మన రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని పథకాలకు మహిళా పేరుతోనే పథకాలు అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. అంతే కాకుండా ఇందిరమ్మ జయంతి సందర్భంగా నేడు కాంగ్రెస్ ప్రభుత్వం మహిళకు ఇందిరమ్మ చీరలు పంపిణీ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో వీరితో పాటు రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, శాసనసభ మాజి సభ్యులు కొండబాల కోటేశ్వరరావు, శాసనమండలి మాజి సభ్యులు పోట్ల నాగేశ్వరరావు, బాలసాని లక్ష్మీనారాయణ, నగర కాంగ్రెస్ కమిటి వర్కింగ్ ప్రెసిడెంట్ నాగండ్ల దీపక్ చౌదరి, రాష్ట్ర ఓబీసీ సెల్ నాయకులు వడ్డేబోయిన నరసింహారావు,బ్లాక్ కాంగ్రెస్ అద్యక్షులు యర్రం బాలగంగాధర్ తిలక్,పి సి సి సభ్యులు వడ్డే నారాయణరావు,పుచ్చకాయల వీరభద్రం, ఏ ఐ సి సి సేవాదళ్ కోఆర్డినేటర్ చోటా బాబా, జిల్లా కాంగ్రెస్ నాయకులు చంద్రశేఖర్,జిల్లా ఆర్ టి ఏ మెంబర్ గజ్జెల్లి వెంకన్న,జిల్లా అనుబంధ సంఘ అధ్యక్షులు దొబ్బల సౌజన్య, సయ్యద్ గౌస్,కార్పొరేటర్లు మలీదు వేంకటేశ్వరరావు, రాపర్తి శరత్, కన్నం వైష్ణవిప్రసన్న కృష్ణ, మాజి కౌన్సిలర్ పాలకుర్తి నాగేశ్వరరావు,జిల్లా ఓ బి సి సెల్ ఉపాధ్యక్షులు గజ్జి సూర్యనారాయణ,నగర కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘ అధ్యక్షులు బాణాల లక్ష్మణ్, షేక్ అబ్బాస్ బేగ్,గడ్డం వెంకటయ్య, బీరెడ్డి రమేష్, నూకారపు వేంకటేశ్వరరావు, కాళంగి కనకరాజు, జహీర్,జాకీర్ హుస్సేన్,యాసబోయిన శ్రీశైలం,రాంబాబు, కొంటెముక్కల నాగేశ్వరరావు, కిలారి అనిల్, భూక్యా సురేష్ నాయక్, వసీం,మహమూద్, బెజ్జం గంగాధర్, లింగాల రవికుమార్,జాని, ఫరీద్ ఖాద్రి, భవానీ, సుకన్య, లక్ష్మీ, ఉమాదేవి, శ్రీధర్ తదితర నాయకులు పాల్గొన్నారు.



# నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ నిలిపివేత

**కీసర, నవంబర్ 19 (తెలంగాణ ముచ్చట్లు):** ఫీడర్ నిర్వహణ పనుల నేపథ్యంలో కీసర-రాంపల్లి పరిధిలోని పలు ప్రాంతాల్లో నేడు తాత్కాలికంగా విద్యుత్ నిలిపివేయనున్నట్లు కీసర విద్యుత్ శాఖ ఏఈ ఎస్. మురళీ కృష్ణ తెలిపారు.కీసర సబ్ స్టేషన్ నుంచి ఉదయం 10:00 గంటల నుంచి మధ్యాహ్నం 1:00 గంటల వరకు విద్యుత్ నిలిపివేయబడే ప్రాంతాలు:కుందన్‌పల్లి గ్రామం, వర్ధన పాఠశాల పరిసరాలు, వికలాంగుల కాలనీ, గోడుమకుంట గ్రామం, ఎజిఎల్ సేవలు.అదేవిధంగా రాంపల్లి సబ్ స్టేషన్ నుండి మధ్యాహ్నం 2:00 గంటల నుంచి సాయంత్రం 5:00 గంటల వరకు 11కెవి ఆర్టిసి కాలనీ ఫీడర్‌పై విద్యుత్ నిలిపివేయనున్నారు. ఈ సమయంలో విద్యుత్ ఉండని ప్రాంతాలు: ఆర్టీసీ కాలనీ, కృష్ణరెడ్డి నగర్, ఎల్మోట్ కాలనీ, శ్రీనివాస్ నగర్ కాలనీ, రిక్వెల్ ఫోర్డ్ స్కూల్, పిసిఆర్ కాలనీ, మధుర నగర్, ఓయు కాలనీ, ప్రత్యుతి కాలనీ, హెవెన్ డౌన్, టిపిఎస్ పుష్ప, ప్రజా సాయి గార్డెన్.ప్రజలు ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని విద్యుత్ శాఖ సూచించింది.



# డిసెంబర్ 14న టిడబ్ల్యూజేఎఫ్ మేడ్చల్ జిల్లా మహాసభలు

- జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలి: టిడబ్ల్యూజేఎఫ్



**మేడ్చల్–మల్కాజిగిరి, నవంబర్ 19 (తెలంగాణ ముచ్చట్లు):** జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టిడబ్ల్యూజేఎఫ్) మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ముఖ్యుల సమావేశం కోరింది. అక్రిడిటేషన్ కార్డులు, ఇళ్ల స్థలాల పంపిణీ, జర్నలిస్టులకు హెల్త్ కార్డుల మంజూరు వంటి అంశాలపై ప్రభుత్వం తక్షణ నిర్ణయం తీసుకోవాలని ఈ సమావేశం డిమాండ్ చేసింది.డిసెంబర్ 14న మేడ్చల్ జిల్లా టిడబ్ల్యూజేఎఫ్ మహాసభలను నిర్వహించాలన్న తీర్మానాన్ని ఈ సమావేశం ఆమోదించింది. సభకు ముఖ్యఅతిథి గా హాజరైన టిడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి. బసవ పున్నయ్య మాట్లాడుతూ జర్నలిస్టు ల సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించాలని కోరారు. జర్నలిస్టుల హక్కులు, సంక్షేమం కోసం ఫెడరేషన్ ఎల్లప్పుడూ కృషి చేస్తుందని ఆయన తెలిపారు.రాష్ట్ర ఉపాధ్యక్షులు జి. రఘు మాట్లాడుతూ మేడ్చల్ జిల్లా చైతన్యవంతమైన ప్రాంతమని, ఈ జిల్లా నుంచి అనేక మంది జర్నలిస్టులు ఉన్నత స్థానాలకు ఎదిగారని అభినందించారు. వ్యక్తిగత పోకడల కారణంగా అధ్యక్షుల బహిష్కరణ జరిగిందని రాష్ట్ర ఉపాధ్యక్షులు రాజశేఖర్ వివరించారు.సమాఖ్యకు టిడబ్ల్యూజేఎఫ్ మల్కాజిగిరి అధ్యక్షులు మల్లేష్ అధ్యక్షత వహించారు. జిల్లాలో ఇప్పటివరకు చేపట్టిన కార్యక్రమాలను రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జి. హరిప్రసాద్ వివరించారు.ఈ సందర్భంగా జిల్లా మహాసభల నిర్వహణ కోసం జి. హరిప్రసాద్‌ను కన్వీనర్‌గా, మల్లేష్, రాజేందర్, వినోద్‌లను కోకన్వీనర్‌లుగా నిర్ణయిస్తూ 11 మంది సభ్యులతో కూడిన అడహాక్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అడహాక్ కమిటీ సభ్యులు:జి. హరిప్రసాద్, మల్లేష్, రాజేందర్, వినోద్, బి. రవి నాయక్, సింగం రాజు, నరేందర్, చైతన్య రెడ్డి, పాండు, ఎస్. పవన్ కుమార్.మేడ్చల్ జిల్లా టిడబ్ల్యూజేఎఫ్ మహాసభలను విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు.

# కాలనీ వాసుల అవసరాల కోసం నిర్మించిన షెడ్డుపై వివాదం

- కార్పొరేటర్ దేవేందర్ రెడ్డి జోక్యం కోరిన కాలనీవాసులు



**మల్లాపూర్, నవంబర్ 19 (తెలంగాణ ముచ్చట్లు):** మల్లాపూర్ సర్వే నంబర్లు 115, 118లోని జెఎన్ఎన్‌యుఆర్ఎం కాలనీ ఫేస్-2లో స్థానిక వాసులు కాలనీ అవసరాల నిమిత్తం చిన్న షెడ్డు నిర్మించారు. అయితే, కాలనీకి సంబంధం లేని వ్యక్తి ఈ షెడ్డుపై అభ్యంతరం తెలుపుతూ జిహెచ్ఎంసి కాప్రా సర్కిల్ అధికారులకు ఫిర్యాదు చేయడంతో కాలనీలో ఉద్రిక్తత నెలకొంది.విషయం తెలుసుకున్న కాలనీ వాసులు సమస్య పరిష్కారానికి ముందుకు వచ్చి, స్థానిక కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. తమ అవసరాల కోసం నిర్మించిన షెడ్డు ఎలాంటి అక్రమ నిర్మాణం కాదని, దానిని తొలగించే ప్రయత్నాలు నిలిపివేయాలని కార్పొరేటర్ నీ కాలనీవాసులు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో గుడ్డేటి వేణు, మంద ఆచయ్య, వెంకట చారి, రాజు, రాజేష్, వెంకటేష్, మల్లేష్, భాగ్యలక్ష్మి, శ్వేతా, కవిత తదితరులు పాల్గొన్నారు.

# కళ్యాణ లక్ష్మి – సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ



- ఎమ్మెల్యే మేఘా రెడ్డి చేతుల మీదుగా లబ్ధిదారులకు చెక్కుల అందజేత

**వనపర్తి,నవంబర్19(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కళ్యాణ లక్ష్మి మరియు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వనపర్తి శాసనసభ్యులు మేఘా రెడ్డి లబ్ధిదారుల కుటుంబాలకు చెక్కులను పంపిణీ చేశారు.పామి రెడ్డి పల్లి గ్రామానికి చెందిన కొంటె మౌని అంజలమ్మ, కొంకలి వెంకటయ్య, మందడి పద్మమ్మలకు చెరో 1,00,116 రూపాయల కళ్యాణ లక్ష్మి చెక్కులు అందజేశారు. అదేవిధంగా ముఖ్యమంత్రి సహాయ నిధి కింద చిట్యాల సాయి రెడ్డికి 21,000 రూపాయలు, పానుగంటి జయలక్ష్మికి 17,000 రూపాయలు, శ్రీపురం సుశీలమ్మకు 15,000 రూపాయల చెక్కులు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా గ్రామానికి చెందిన స్థానిక కాంగ్రెస్ నేతలు మాజీ ఎంపిటిసి ఇందిరా లక్ష్మారెడ్డి, మధిర శ్రీశైలం, కొంకల్లి నరేష్, కొంటె మోనిశేఖర్, ఎల్లయ్య, మందడి చిన్న మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.ఎమ్మెల్యే మేఘా రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు ప్రతి అర్హులైన కుటుంబానికి చేరేలా కృషి చేస్తున్నామని తెలిపారు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



## పీఎం కిసాన్ డబ్బులు రాలేదా? ఇలా చెక్ చేసుకోండి, వెంటనే పరిష్కారం

దేశంలోని కోట్లాది మంది రైతులకు ఇవాళ పెద్ద శుభవార్త రానుంది. పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకం కింద 21వ విడత నిధులను ప్రధాని నరేంద్ర మోదీ కోయంబత్తూరులో బటన్ నొక్కి విడుదల చేయనున్నారు. సుమారు 18 వేల కోట్ల రూపాయలు నేరుగా రైతుల బ్యాంక్ ఖాతాల్లో జమ కానున్నాయి. దేశవ్యాప్తంగా తొమ్మిది కోట్ల మందికి పైగా లబ్ధిదారులు ఒక్కొక్కరు రూ.2,000 చొప్పున పొందనున్నారు. మధ్యాహ్నం 1.30 తర్వాత ఈ డబ్బులు ఖాతాల్లోకి చేరే అవకాశముంది. దీంతో దేశమంతా రైతుల్లో ఆశాభావం నెలకొంది.

మీ ఖాతాలో పీఎం కిసాన్ నిధులు పడ్డాయా లేదా ఎలా తెలుసుకోవాలి?

పీఎం కిసాన్ అధికారిక వెబ్‌సైట్‌ను ఓపెన్ చేస్తే రైతుల కోసం ప్రత్యేకంగా ఉన్న సెక్షన్ కనిపిస్తుంది. అందులోని ఆప్షన్‌ను ఎంచుకుని, మీ రిజిస్ట్రేషన్ నెంబర్, భద్రతా కోడ్‌ను నమోదు చేస్తే సరిపోతుంది. మీ మొబైల్‌కు వచ్చే ఓటీపీని ఎంటర్ చేసిన తర్వాత ఈ విడత నిధులు మీకు విడుదల అయ్యాయా లేదా అనేది వెంటనే స్క్రీన్‌పై కనిపిస్తుంది. ఈ ప్రక్రియ చాలా సులభంగా ఉండటంతో, ఎక్కువ మంది రైతులు ఇంట్లోనే స్టేటస్ చెక్ చేసుకోవచ్చు.

డబ్బులు రాకపోతే కారణాలు ఏమిటి? పరిష్కారం ఏమిటి?

చాలా సందర్భాల్లో ఈకేవైసీ పూర్తి చేయకపోవడం లేదా వెరిఫికేషన్ గడువు ముగియడం వల్ల నిధులు నిలిచిపోతాయి. పీఎం కిసాన్ పోర్టల్‌లో ఓటీపీ ద్వారా డిజిటల్ ఈకేవైసీ చేసుకోవచ్చు. అలాగే సమీపంలోని కామన్ సర్వీస్ సెంటర్ లో బయోమెట్రిక్ వెరిఫికేషన్ చేసి కూడా ఈకేవైసీ పూర్తి చేయవచ్చు. పీఎం కిసాన్ మొబైల్ యాప్‌ను ఉపయోగించినా ఇదే సౌకర్యం లభిస్తుంది.

అదే విధంగా ఆధార్, పాన్ లింక్ సమస్యలు ఉన్నా లేదా బ్యాంక్ అకౌంట్‌లో కేవైసీ అప్‌డేట్ చేయలేని పరిస్థితుల్లో కూడా డబ్బులు నిలిచిపోతాయి. ఈ సందర్భంలో మీ బ్యాంక్ బ్రాంచ్‌ను ప్రత్యక్షంగా సంప్రదించి వివరాలు అప్‌డేట్ చేయాలి. అవసరమైన వెరిఫికేషన్ పూర్తిచేసిన కొన్ని రోజుల్లో మీ ఖాతాలో నిధులు జమ అవుతాయి. రైతులకు ప్రభుత్వం అందిస్తున్న ఈ సాయం సమయానికి అందాలంటే, కేవైసీ అప్‌డేట్‌లు, ఆధార్‌అకౌంట్ లింక్ వంటి వివరాలు సమయానికి సరిచేసుకోవడం చాలా అవసరం.




## బీఎస్ఎన్ఎల్ భారీ ఆఫర్ విద్యార్థులకు 100GB డేటా, అపరిమిత కాలింగ్

ప్రభుత్వ రంగ టెలికాం సంస్థ భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ఒక కొత్త మొబైల్ ప్లాన్‌ను ప్రవేశపెట్టింది. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రారంభించిన ఈ విద్యార్థి ప్రత్యేక పథకం యువతకు మరింత సౌకర్యం కలిగేలా రూపొందించబడిందని బీఎస్ఎన్ఎల్ సంస్థ ముఖ్య అధికారి రాబర్ట్ జే. రవి వెల్లడించారు. విద్యార్థులు, మహిళల కోసం ప్రత్యేక పథకాలు తీసుకురావాలన్న ఆలోచనలో భాగంగా రూపొందించిన ఇదే తొలి పథకమని ఆయన తెలిపారు.

విద్యార్థుల అవసరాలను గమనించి ఈ ప్రణాళికను పరిమిత కాలానికి వినియోగదారుల ముందుకు తెచ్చారు. రోజుకి తక్కువ ఖర్చుతో లభించే ఈ పథకం నెలసరి రూ. 251కే అందుబాటులో ఉంటుంది. ఈ పథకంలో వినియోగదారులకు కాల్స్, సందేశాలు, ఇంటర్నెట్ వాడకం వంటి అన్ని ముఖ్య సేవలు అందించబడతాయి.

కొత్త పథకం ప్రయోజనాలు

ఈ ఆఫర్ నవంబర్ 14 నుండి డిసెంబర్ 13, 2025 వరకు అమల్లో ఉంటుంది. నెల రోజుల చెల్లుబాటుతో పాటు 100 జీబీ వేగవంతమైన డేటా, అపరిమిత కాలింగ్, రోజుకు 100 సందేశాల పంపకం వంటి సేవలను బీఎస్ఎన్ఎల్ అందిస్తోంది. ఈ పథకం కొత్తవారికే కాకుండా అందరు బీఎస్ఎన్ఎల్ వినియోగదారులకు కూడా వర్తిస్తుంది.

ఈ పథకం పొందడానికి సమీప బీఎస్ఎన్ఎల్ కస్టమర్ సేవా కేంద్రాన్ని సంప్రదించవచ్చు. అదేవిధంగా సంస్థ అందించిన కాల్ సౌకర్యం లేదా అధికారిక వెబ్‌సైట్ ద్వారా కూడా వివరాలు తెలుసుకోవచ్చు.

భారత్ స్వదేశీ వ్యవస్థతో కూడిన నాలుగో తరగతి సేవలను అభివృద్ధి చేసిన దేశాల్లో ఒకటిగా ఎదిగిందని, బీఎస్ఎన్ఎల్ దేశమంతటా ఈ నెట్‌వర్క్‌ను మరింత విస్తరించడానికి చర్యలు తీసుకుంటోందని సంస్థ అధికారులు పేర్కొన్నారు. 100 జీబీ డేటాతో కూడిన ఈ పథకం విద్యార్థులకు మరింత ఉపయోగకరంగా మారుతుందన్నారు.

# ఒకే బ్యాంక్ అకౌంట్ సరిపోతుందా? లేక ఎక్కువ అకౌంట్లు ఉన్నా మంచిదా?

సాధారణంగా భారతీయ కుటుంబాల ఎక్కువ శాతం ఒకే బ్యాంక్ అకౌంట్‌తో అన్ని లావాదేవీలు నిర్వహిస్తూ ఉంటాయి. జీతం పొందడం, బిల్లులు చెల్లించడం, ఖర్చులు, సేవింగ్స్ కానీ ఇది ఆర్థికంగా సరైన పద్ధతి కాదని బ్యాంకింగ్ రంగ నిపుణులు స్పష్టంగా చెబుతున్నారు. మన డబ్బులు, ఖర్చులు, సేవింగ్స్ మీద స్పష్టమైన నియంత్రణ ఉండాలంటే కనీసం మూడు బ్యాంక్ అకౌంట్లను వేర్వేరుగా నిర్వహించడం మంచిదని వారు సూచిస్తున్నారు.




నిపుణుల అభిప్రాయం ప్రకారం ఒక సేవింగ్స్ అకౌంట్, ఒక ఇన్వెస్ట్‌మెంట్ అకౌంట్, ఒక ఎక్స్‌పెన్స్ అకౌంట్ ఉంటే ఆర్థిక వ్యవహారాలపై పూర్తి స్థాయి క్లారిటీ వస్తుంది. ఒకే అకౌంట్‌లో డబ్బులు రావడం-పోవడం కలిసిపోతున్నప్పుడు ఎంత సేవింగ్ చేశాం? ఎంత ఇన్వెస్ట్ చేశాం? అవసరం లేని ఖర్చులు ఏవి? అనేవి గుర్తించడం కష్టమవుతుంది. కానీ అకౌంట్లను వేరు చేస్తే ఈ మూడు విభాగాల మీద పూర్తిగా హోల్డ్ వస్తుంది.

సేవింగ్స్ అకౌంట్‌ను రోజువారీ అవసరాల కోసం మాత్రమే వినియోగించాలి. అవసరం కాని అదనపు డబ్బును అక్కడే ఉంచడం కంటే ఇన్వెస్ట్‌మెంట్ అకౌంట్‌కు తరలించడం మంచిదని నిపుణులు చెబుతున్నారు. సేవింగ్స్ లేదా ఫిక్స్‌డ్ డిపాజిట్లపై ఎక్కువ వడ్డీ ఇచ్చే బ్యాంకులో ఈ అకౌంట్ ఉండటం ప్రయోజనకరం.

ఇన్వెస్ట్‌మెంట్ అకౌంట్ పూర్తిగా పొదుపుల కోసం. మ్యూచువల్ ఫండ్స్ లు లేదా ఇతర ఇన్వెస్ట్‌మెంట్స్‌కు డబ్బులు పంపే కేంద్రంగా ఇది ఉండాలి. ఇలాంటి ప్రత్యేక అకౌంట్ ఉంటే మన పెట్టుబడుల మొత్తం, దిసా, పురోగతి—అన్నీ స్పష్టంగా కనిపిస్తాయి.

ఎక్స్‌పెన్స్ అకౌంట్‌ను జీవనశైలికి సంబంధించిన ఖర్చులకే వినియోగించాలి. ఇల్లు అద్దె, EMIలు, కూరగాయల కొనుగోలు, బట్టలు, ట్రాన్స్‌పోర్ట్ ఈ అకౌంట్ నుంచే జరిపితే ప్రతి నెల మన లైఫ్‌స్టైల్ ఖర్చులు ఎలా పెరుగుతున్నాయి అనేది వెంటనే అర్థమవుతుంది. కొన్నిసార్లు అవసరం లేని ఖర్చులను కూడా ఈజీగా గుర్తించి తగ్గించుకునే అవకాశం ఉంటుంది.

మొత్తానికి, మూడు బ్యాంక్ అకౌంట్లు నిర్వహించడం ఆర్థిక నియంత్రణ, పారదర్శకత, అనవసర ఖర్చుల నియంత్రణ, సేవింగ్స్ పెంపు లాంటిది. నిపుణుల మాటల్లో చెప్పాలంటే—"ఒకే అకౌంట్‌తో అన్నీ నిర్వహించడం సౌకర్యంగా అనిపించినా, మూడు అకౌంట్ల వ్యవస్థ భవిష్యత్తులో మీ డబ్బును కాపాడే తెలివైన ఆర్థిక అలవాటు."

# అదానీ గ్రూప్‌లో భారీ బ్లాక్ డీల్స్ కలకలం

## ఐదు కంపెనీల్లో చేతులు మారిన కోట్లాది షేర్లు

దేశీయ స్టాక్ మార్కెట్‌లో బుధవారం ఉదయం నుంచే అదానీ గ్రూప్ కంపెనీలు ప్రధాన ఆకర్షణగా మారాయి. మార్కెట్ సూచీలు ఒడిదుడుకుల్లో ట్రేడవుతున్న తరుణంలో, అదానీకి చెందిన సంస్థల షేర్లు ఒక్కసారిగా హైలైట్ కావడానికి కారణం మంగళవారం జరిగిన భారీ బ్లాక్ డీల్స్. ప్రముఖ పెట్టుబడిదారుడు రాజీవ్ జైన్ ఆధ్వర్యంలో నడుస్తున్న జీక్యూజీ పార్ట్‌నర్స్ మరోసారి అదానీ గ్రూప్‌లో పెట్టుబడులు పెంచుకోవడం మార్కెట్ వర్గాల్లో పెద్ద చర్చనీయాంశంగా మారింది. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం ఈ లావాదేవీలు రిలయన్స్ ట్రస్ట్ విక్రయం ద్వారా జరిగాయి. మొత్తంగా ఐదు ప్రధాన అదానీ కంపెనీల్లో కోట్లాది షేర్లు చేతులు మారగా, వాటి విలువ రూ.5,094 కోట్లకు చేరింది.




ఈ భారీ లావాదేవీల జాబితాలో అదానీ ఎంటర్‌ప్రైజెస్ ముందు వరుసలో నిలిచింది. ఈ కంపెనీలో 53 లక్షలకు పైగా షేర్లను జీక్యూజీ కొనుగోలు చేసింది. ఒక్కో షేర్ ధర రూ.2,462 వద్ద నిర్ణయించగా మొత్తం లావాదేవీ విలువ రూ.1,315 కోట్లకు చేరింది. బుధవారం ట్రేడింగ్ సమయంలో ఈ షేర్ రూ.2,440 ప్రాంతంలో కదలాడింది. రిలయన్స్ ట్రస్ట్ ఇన్‌స్టిట్యూషనల్ రిటైర్మెంట్ ట్రస్ట్ ఇక్కడ కీలక విక్రయదారుగా వ్యవహరించింది. ఇప్పటికే జీక్యూజీ ఈ కంపెనీలో గణనీయమైన వాటాను కలిగి ఉండగా, తాజా కొనుగోళ్లతో వారి హోల్డింగ్ మరింత పెరిగింది.

అదేవిధంగా అదానీ పోర్ట్స్ అండ్ స్పెషల్ ఎకనామిక్ జోన్ షేర్లు కూడా బ్లాక్ డీల్స్‌లో పెద్ద మొత్తంలో కొనుగోలు చేయబడ్డాయి. 73 లక్షలకు పైగా షేర్లకు ఒక్కోటి రూ.1,507 ధర నిర్ణయించగా, మొత్తం విలువ రూ.1,103 కోట్లకు చేరింది. ఈ కంపెనీలో కూడా రిలయన్స్ ట్రస్ట్ విక్రయం చేసింది. ఇప్పటికే జీక్యూజీకి ఈ సంస్థలో 2 శాతం దాటిన వాటా ఉండగా, ఇప్పుడు మరింత బలం లభించింది. అదానీ గ్రీన్ ఎనర్జీ కూడా ఈ లావాదేవీలకు వేదికైంది. ఇక్కడ 77 లక్షలకు పైగా షేర్లను కొనుగోలు చేసి రూ.842 కోట్ల లావాదేవీ జరిగింది. ఒక్కో షేర్‌ను రూ.1,088 ధరకు కొనుగోలు చేశారు. అదానీ ఎనర్జీ సొల్యూషన్స్‌లో జరిగిన లావాదేవీల విలువ రూ.551 కోట్లను దాటింది. అదానీ పవర్‌లో మూడు విడతల్లో కొనుగోలు చేసిన షేర్ల విలువ రూ.1,281 కోట్లకు చేరింది. ఈ మూడు సంస్థల్లోనూ రిలయన్స్ ట్రస్ట్ విక్రయదారుగా ఉన్నందున మార్కెట్ వర్గాల్లో ఈ డీల్‌పై మరింత ఆసక్తి నెలకొంది. హిండెన్‌బర్గ్ రీసెర్చ్ సంచలన నివేదిక వెలువడిన సమయంలో అదానీ గ్రూప్ షేర్లు పెద్ద ఎత్తున కుంగిపోయిన విషయం తెలిసిందే. ఆ సమయంలో కూడా జీక్యూజీ పార్ట్‌నర్స్ ముందుకు వచ్చి పెద్ద పెట్టుబడులు పెట్టడం వల్ల అదానీ గ్రూప్ షేర్లు తిరిగి పుంజుకున్నాయి. ఆ నమ్మకమే ఇప్పుడు మళ్లీ ఇలాంటి భారీ స్థాయి పెట్టుబడులకు దారితీసిందని నిపుణుల అభిప్రాయం. ఈ తాజా బ్లాక్ డీల్స్ అదానీ గ్రూప్ ఆర్థిక స్థితికి మరింత బలాన్నిచ్చే అవకాశముందని, పెట్టుబడిదారుల్లో కూడా సానుకూల సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని మార్కెట్ విశ్లేషకులు చెబుతున్నారు.

# భారత ఐఫోన్ యూజర్లకు శుభవార్త..

## రూ.799కే యాపిల్ కేర్ ప్లస్ రెండు సంవత్సరాలపాటు

భారతీయ ఐఫోన్ యూజర్లకు అదిరే వార్త. టెక్ దిగ్గజం యాపిల్ తమ వినియోగదారులకు అందుబాటు ధరలో కొత్త యాపిల్ కేర్ ప్లస్ కవరేజీ అందుబాటులోకి తీసుకొచ్చింది. రూ. 799కే రెండు సంవత్సరాలపాటు ఫోన్లకు సురక్షితమైన రక్షణ పొందవచ్చు.ఐఫోన్ 13 నుంచి ఐఫోన్ 17 వరకు, అలాగే ఐఫోన్ ఎస్‌ఈలకు కూడా ఈ కవరేజీ వర్తిస్తుంది. యాపిల్ కేర్ ప్లస్ ద్వారా ఫోన్ పోగొట్టిపోతే లేదా చోరీకి గురైతే ఏడాదికి రెండు సార్లు రిపేర్ పొందవచ్చు. సాధారణంగా ఒక సంవత్సరం హార్డ్‌వేర్ వారంటీ మాత్రమే లభించగా, ఈ ప్లాన్ తీసుకుంటే రక్షణను రెండేళ్లపాటు పొడిగించుకోవచ్చు. ప్రమాదవశాత్తు జరిగే నష్టాలకు కూడా అన్‌లిమిటెడ్ రిపేర్ సదుపాయం ఉంటుంది. వినియోగదారులు కొత్త ఐఫోన్ కొనుగోలు చేసిన వెంటనే లేదా 60 రోజుల లోపు యాపిల్ కేర్ ప్లస్‌ను సబ్‌స్క్రైబ్ చేసుకోవచ్చు. ఇది యాపిల్ ఉత్పత్తుల సెట్టింగ్స్ యాప్ ద్వారా చేసుకోవచ్చు. కవరేజీలో బ్యాటరీ రీప్లేస్‌మెంట్ సర్వీస్, 24 గంటల ప్రాధాన్యతా సపోర్ట్ వంటి లాభాలు ఉన్నాయి. రిపేర్‌లు యాపిల్ స్టోర్‌లు లేదా అథరైజ్డ్ సర్వీస్ ప్రొవైడర్ల వద్ద మాత్రమే జరుగుతాయి. దీంతో యాపిల్ ఒరిజినల్ విడిభాగాలే ఉపయోగిస్తుందని కంపెనీ హామీ ఇస్తోంది.



# ఆధార్ కార్డు దుర్వినియోగానికి చెక్

◆ కొత్త నియమాలకు సిద్ధమైన ఆధార్ ప్రాధికారం

ఆధార్ కార్డు భద్రతను మరింత బలోపేతం చేసే దిశగా భారత విశిష్ట గుర్తింపు ప్రాధికారం కీలక నిర్ణయాలు తీసుకునేందుకు సిద్ధమైంది. వ్యక్తిగత సమాచారాన్ని అపహరించకుండా నిరోధించేందుకు, భవిష్యత్‌లో జారీ చేసే ఆధార్ కార్డుల్లో కార్డుదారుడి ఫోటో, త్వరిత ప్రతిస్పందన సంకేతం మాత్రమే ఉండేలా మార్పులను పరిశీలిస్తోంది. ఆధార్‌పై అదనపు వివరాలు ముద్రించడాన్ని పూర్తిగా నిలిపివేయాలనే అంశంపై ప్రాధికారులు చర్చిస్తున్నారు. పలు హోటళ్లు, కార్యక్రమ నిర్వాహకులు, ప్రైవేటు సంస్థలు ఇప్పటికీ ఆధార్ కార్డు నకలు తీసుకొని వ్యక్తిగత వివరాలను భద్రపరుస్తుండటం వల్ల గోప్యతకు భంగం కలుగుతోందని అధికారులు వెల్లడించారు. ఈ నేపథ్యంలో డిసెంబర్‌లోనే కొత్త నియమాలు అమల్లోకి తెచ్చే అవకాశముంది. "ఆధార్ కార్డు పై ఎక్కువ వివరాలు ముద్రిస్తే, కొందరు దాన్ని ఉపయోగించి తప్పుడు పనులు చేయడానికి ప్రయత్నిస్తారు. అందుకే ఫోటో, త్వరిత ప్రతిస్పందన సంకేతం మాత్రమే ఉండేలా మార్పులు చేస్తుండాం" అని సంస్థాధిపతి తెలిపారు. ప్రస్తుతం చట్టం ప్రకారం, ఎవరికీ ఆధార్ నంబర్ లేదా బయోమెట్రిక్ వివరాలను ప్రత్యక్ష పత్రాల రూపంలో సేకరించే అధికారం లేదు. అయినప్పటికీ అనేక సంస్థలు ఆధార్ నకలులను నిల్వచేసే పరిస్థితిని ఆధార్ ప్రాధికారం తీవ్రంగా పరిగణిస్తోంది. త్వరిత ప్రతిస్పందన సంకేతం ద్వారా మాత్రమే ఆధార్ ధృవీకరణ జరగాలని, కార్డును పత్రంగా ఎక్కడా ఇవ్వకూడదని వివరించారు. కొత్త మొబైల్ అనువర్తనం రూపొందించబడుతోంది. ఇది ప్రస్తుత ఆధార్ అనువర్తనాన్ని పూర్తిగా భర్తీ చేస్తుంది. ఈ కొత్త అనువర్తనం ద్వారా చిరునామా మార్పులు, కుటుంబ సభ్యుల వివరాల సవరణ, మొబైల్ నంబర్ ధృవీకరణ వంటి కార్యక్రమాలు మరింత భద్రంగా చేయగలుగుతారు. ముఖ గుర్తింపు వ్యవస్థ కూడా అనువర్తనంలో భాగమవుతుందని అధికారులు తెలిపారు.పలు సేవా సంస్థలు వ్యక్తుల గుర్తింపును ధృవీకరించడానికి వినియోగించే విధానాన్ని కూడా ప్రాధికారం సరిచేయనుంది. త్వరిత ప్రతిస్పందన సంకేతాన్ని చూపడం, ఆపై ముఖ ధృవీకరణ జరగడం ద్వారా వ్యక్తి ఉనికిని నిర్ధారించుకునే విధానం త్వరలో అమల్లోకి రాబోతోంది. ఈ విధంగా ధృవీకరణ ప్రక్రియ మరింత పారదర్శకంగా, భద్రంగా మారుతుందని చెప్పారు. దేశ వ్యాప్తంగా ఆధార్ వినియోగాన్ని మరింత సురక్షితంగా మార్చే ఈ నిర్ణయాలు అమల్లోకి వస్తే, వ్యక్తిగత సమాచార దుర్వినియోగం గణనీయంగా తగ్గే అవకాశం ఉంది. ఆధార్ కార్డు భవిష్యత్‌లో పూర్తిగా డిజిటల్ ఆధారంగా పని చేసే గుర్తింపుపత్రంగా మారబోతోంది.

# శ్రీ సత్యసాయి ఆశ్రమంలో ప్రధాని మోదీ ప్రత్యేక దర్శనం

- సత్యసాయి బాబాకు ప్రధాని నివాళి
- ప్రసాంతి నిలయంలో పుణ్యక్షేత్ర సందర్శన
- సేవా స్ఫూర్తి తరాలు దాటే సందేశమని ప్రధాని వ్యాఖ్య



శ్రీ సత్యసాయి బాబా సమాధి స్థలమైన ప్రసాంతి నిలయంలో ప్రధాని నరేంద్ర మోదీ ప్రత్యేక పర్యటన నిర్వహించారు. సాయి కుల్వంత్ హాల్‌లో బాబాకు నివాళులర్పించిన అనంతరం, ఓంకార్ హాల్‌లో దర్శనం చేశారు. పుణ్యక్షేత్రంలోని ఆధ్యాత్మిక వాతావరణం ప్రధానికి మరింత ప్రత్యేకంగా అనిపించింది. ప్రధాని ముందుగా సాయి కుల్వంత్ హాల్‌కు చేరుకొని పుష్పాంజలి ఘటించారు. స్వామిజీ జీవితం, బోధనలు, మానవతా సేవలపై ఆయన చూపిన అంకితభావాన్ని స్మరించుకున్నారు. అనంతరం ఆశ్రమ ప్రతినిధులతో స్వల్ప చర్చ జరిపినట్లు సమాచారం. దర్శనం అనంతరం మోదీ ఓంకార్ హాల్‌ను సందర్శించారు. ఈ ప్రాంతం ఆధ్యాత్మికతకు నాంది పలికే పవిత్ర స్థలమని, ఇలాంటి ప్రదేశాల్లో ఉండటం మనసుకు ప్రశాంతిని ఇస్తుందని ఆయన పేర్కొన్నారు. బాబా చూపిన నిస్వార్థ సేవా మార్గం కోట్లాది మందికి ప్రేరణగా నిలుస్తోందని గుర్తుచేశారు. ప్రసాంతి నిలయం సందర్శన సందర్భంగా ప్రధాని బాబా సందేశం కేవలం భక్తులకు మాత్రమే కాదు, సమాజానికి వెలుగును పంచే మార్గదర్శకత్వమని అభివర్ణించారు. నిస్వార్థ సేవ, ప్రేమ, కరుణ ఇవి భవిష్యత్తు తరాలకు మార్గదర్శకమని మోదీ వ్యాఖ్యానించారు.

# భారత్‌లో భారీ దాడులకు జైషే కుట్ర

- ఢిల్లీ పేలుడుతో బయటపడుతున్న జైషే ముఠా కొత్త ప్లాన్
- 'మేడమ్ సర్జన్' నేతృత్వంలో డిజిటల్ ఫండింగ్ నెట్‌వర్క్
- మహిళలతో ప్రత్యేక ఉగ్ర యూనిట్ 'జమాతుల్–ముమినాత్' ఏర్పాటు





ఢిల్లీలో జరిగిన పేలుడు ఘటనపై దర్యాప్తు కొనసాగుతున్న కొద్దీ జైషే మహ్మద్ సంస్థ చేసిన కుట్రలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి. పాకిస్థాన్ కేంద్రంగా కార్యకలాపాలు జరుపుతున్న ఈ సంస్థ భారత్ వ్యాప్తంగా భారీ దాడులకు సిద్ధమవుతోందని నిఘా సంస్థలు గుర్తించాయి. ముఖ్యంగా దేశంలో ఫిదాయిన్ దాడులను అమలు చేయాలన్న ప్రయత్నాలు జరుగుతున్నట్లు దర్యాప్తు నివేదికల్లో స్పష్టమవుతోంది. పాకిస్థాన్‌లోని ఆన్‌లైన్ ఛానళ్ల ద్వారా జైషే ముఠా విరాళాలు సేకరిస్తున్న విషయం దర్యాప్తు అధికారులు బయటపెట్టారు. 'ముజాహిద్ వింటర్ కిట్స్' పేరుతో 20 వేల పాకిస్థాన్ రూపాయల (భారత కరెన్సీలో రూ.6,400) చొప్పున డొనేషన్లు తీసుకుంటున్నట్లు తెలిసింది. ఈ నిధులతో బూట్లు, ఉల్లెన్ సాక్స్, టెంట్లు, మెట్రెస్‌లు వంటి సామగ్రిని ఫిదాయిన్ దళాలకు అందించాలనే ప్లాన్‌తో ముందుకు సాగుతున్నట్లు నిఘా వర్గాలు పేర్కొన్నాయి. పాకిస్థాన్‌కు చెందిన సదాపే వంటి డిజిటల్ పేమెంట్ యాప్‌ల ద్వారా ఈ విరాళాలు స్వీకరిస్తున్నట్లు దర్యాప్తు బృందాలు గుర్తించాయి. ఈ ఆన్‌లైన్ ఫండింగ్ నెట్‌వర్క్‌లో 'మేడమ్ సర్జన్'గా వ్యవహరించే డాక్టర్ షాహీనా సాయిద్ కీలక పాత్ర పోషిస్తున్నట్లు తేలడం సంచలనంగా మారింది. ఎర్రకోట పేలుడులో ప్రధాన అనుమానితుల్లో ఒకరిగా ఉన్న ఆమె ఈ విరాళాల నిర్వహణ బాధ్యతను నేరుగా తీసుకున్నట్లు తెలుస్తోంది. డాక్టర్ షాహీనా సాయిద్ పాత్ర బయటపడడంతో ఆమె ఆధ్వర్యంలో నడుస్తున్న డిజిటల్ ఫండింగ్ వ్యవస్థపై దర్యాప్తు అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఈ నిధుల ద్వారా భారత్‌లో దాడులను అమలు చేయాలన్న ప్రయత్నాలు స్పష్టమవుతున్నాయి. దేశంలో వివిధ ప్రాంతాల్లో ఉగ్ర చర్యలకు కావాల్సిన వనరులను సమకూర్చడమే ఈ నెట్‌వర్క్ లక్ష్యమని అధికారులు భావిస్తున్నారు. ఇదివరకు బయటపడిన సమాచారంలో మరింత భయంకరమైన అంశం వెలుగులోకి వచ్చింది. జైషే మహ్మద్ సంస్థ మహిళలతో కూడిన ప్రత్యేక యూనిట్ 'జమాతుల్–ముమినాత్'ను ఏర్పాటు చేస్తున్నట్లు నిఘా వర్గాలు తెలిపాయి. మసూద్ అజార్ సోదరి సాదియా అజార్ ఈ యూనిట్‌ను నడుపుతున్నట్లు సమాచారం. మహిళలకు ఆన్‌లైన్ జిహాదీ కోర్సులను అందిస్తూ ఉగ్రవాద కార్యకలాపాలకు ప్రేరేపించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ కోర్సుల ద్వారా భారత్‌లోని మహిళలను కూడా ఆకర్షించేందుకు కుట్రలు పన్నుతున్నట్లు దర్యాప్తు సంస్థలు వెల్లడించాయి. ప్రత్యేకంగా 'మేడమ్ సర్జన్' షాహీనా సాయిద్‌కు జైషే మహిళా విభాగం బాధ్యతలు అప్పగించడంతో ఈ నెట్‌వర్క్ మరింత శక్తివంతమైందని అధికారులు భావిస్తున్నారు. ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లను వినియోగించి సోషల్ రిక్రూట్‌మెంట్ కార్యకలాపాలు వేగంగా సాగుతున్నట్లు తెలుస్తోంది. ఎర్రకోట పేలుడు కేసులో షాహీనా పాత్ర స్పష్టమవుతున్న కొద్దీ భారత నిఘా సంస్థలు ఈ కొత్త మహిళా ఉగ్ర యూనిట్‌పై దృష్టి పెంచాయి. దేశంలో మహిళలను టార్గెట్ చేసే ఈ కుట్రలు పెద్ద ముప్పుగా మారే అవకాశముండటంతో కేంద్ర సంస్థలు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటున్నాయి. భారత్ అంతటా డిజిటల్ ఫండింగ్, ఆన్‌లైన్ రిక్రూట్‌మెంట్ నెట్‌వర్క్‌లపై కఠిన నిఘా కొనసాగుతూనే ఉంది. జైషే కార్యకలాపాలు నిరంతరం మారుతున్న తరుణంలో, ఆన్‌లైన్ మార్గాల ద్వారా నిధుల సేకరణ, మహిళల మోహాన్ని ఉపయోగించుకునే కొత్త విధానాలు దర్యాప్తు సంస్థలకు పెద్ద సవాళ్లుగా మారాయి. ఢిల్లీ పేలుడుతో బయటపడుతున్న ఈ కుట్రల నేపథ్యంలో దేశవ్యాప్తంగా భద్రతా చర్యలు మరింత కట్టుదిట్టం అవుతున్నాయి.

# వచ్చే బడ్జెట్ 202627 కోసం కీలక సిఫార్సులు

- ఆర్థిక స్థిరత్వం, డిజిటల్ మౌలిక సదుపాయాలు మరియు పరిశ్రమ సవాళ్లపై చర్చ
- ఉన్నతాధికారుల సమక్షంలో సమావేశం నిర్వహణ
- ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్




కేంద్ర ఆర్థిక మరియు కార్పొరేట్ వ్యవహారాల మంత్రి శ్రీమతి నిర్మలా సీతారామన్ రాబోయే కేంద్ర బడ్జెట్ 202627 తయారీకి సంబంధించి బ్యాంకింగ్, ఆర్థిక సేవలు మరియు బీమా రంగ నిపుణులతో ఏడవ ప్రీబడ్జెట్ సంప్రదింపుల సమావేశానికి నేడు న్యూఢిల్లీలో అధ్యక్షత వహించారు. ఈ కీలక సమావేశంలో ఆర్థిక వ్యవస్థకు ప్రధానమైన రంగానికి సంబంధించిన సవాళ్లు మరియు అవకాశాలపై విస్తృత స్థాయిలో చర్చలు జరిగాయి. ఆర్థిక స్థిరత్వాన్ని పెంచడం, డిజిటల్ మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం మరియు ఈ రంగంలో తలెత్తుతున్న సమస్యలను పరిష్కరించడం వంటి అంశాలపై ప్రధానంగా దృష్టి సారించారు. ఈ సమావేశంలో బ్యాంకింగ్, ఆర్థిక సేవల రంగ నిపుణులు ఆర్థిక మంత్రికి తమ విలువైన సూచనలు మరియు డిమాండ్లను సమర్పించారు. బ్యాంకింగ్ రంగం నుంచి రుణ ప్రవాహాన్ని బలోపేతం చేయడం, ఆర్థిక వ్యవస్థలో ద్రవ్య లభ్యతను మెరుగుపరచడం మరియు నిబంధనల స్పష్టత కోసం వారు సిఫార్సులు చేశారు. ఆర్థిక వృద్ధికి అవసరమైన రుణాన్ని అందించడంలో బ్యాంకులు ఎదుర్కొంటున్న సవాళ్లను పరిష్కరించాలని, అలాగే మూలధన కేటాయింపు నిబంధనలను హేతుబద్ధీకరించాలని కోరారు. బీమా రంగ ప్రతినిధులు బీమా వ్యాప్తిని పెంచడానికి, ప్రత్యేకించి గ్రామీణ మరియు తక్కువ ఆదాయ వర్గాల ప్రజలకు, మరిన్ని పన్ను ప్రోత్సాహకాలు కల్పించాలని మరియు జీఎస్టీ రేట్లను హేతుబద్ధీకరించాలని అభ్యర్థించారు. బీమా ప్రీమియం చెల్లింపులపై ప్రస్తుతం ఉన్న పన్ను మినహాయింపు పరిమితులను పెంచడం ద్వారా ఎక్కువ మంది ప్రజలు బీమా పాలసీలను తీసుకోవడానికి ప్రోత్సహించాలని, తద్వారా సామాజిక భద్రతను మెరుగుపరచాలని వారు సూచించారు. పెట్టుబడిదారుల సెంటిమెంట్‌ను మెరుగుపరచడం మరియు దేశీయ పొదుపును ప్రోత్సహించడం కోసం మూలధన మార్కెట్లకు సంబంధించిన సూచనలు కూడా ఈ చర్చల్లో భాగంగా ఉన్నాయి.

ప్రీబడ్జెట్ సంప్రదింపుల ప్రక్రియలో భాగంగా, ఆర్థిక మంత్రి గత కొద్ది రోజులుగా వివిధ రంగాల వాటాదారులతో సమావేశమవుతున్నారు. BFSI రంగంతో నేటి సంప్రదింపుల ముందు, ఆమె ఇప్పటికే ప్రముఖ ఆర్థికవేత్తలు, వ్యవసాయ రంగ ప్రతినిధులు, సూక్ష్మ, చిన్న మరియు మధ్య తరహా పరిశ్రమల రంగం, మూలధన మార్కెట్లు మరియు స్టార్టప్ పర్యావరణ వ్యవస్థ ప్రతినిధులతో చర్చలు నిర్వహించారు. ఈ విస్తృతమైన సంప్రదింపుల పరంపర ద్వారా, రాబోయే బడ్జెట్‌లో వివిధ రంగాల యొక్క విభిన్న దృక్పథాలు మరియు ప్రాధాన్యతలను ప్రతిబింబించేలా చూడటం ప్రభుత్వ లక్ష్యం. ఈ కీలక సమావేశానికి కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి శ్రీ పంకజ్ చౌదరి, ఆర్థిక వ్యవహారాల శాఖ కార్యదర్శి, భారత ప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదారు మరియు ఆర్థిక సేవల విభాగం సీనియర్ అధికారులు కూడా హాజరయ్యారు. బ్యాంకింగ్, ఆర్థిక సేవల రంగం భారతదేశ ఆర్థిక వృద్ధికి కీలకమైనది, ఇది ఆర్థిక చేరికను, రుణ లభ్యతను మరియు పెట్టుబడిని ప్రోత్సహిస్తుంది. రాబోయే బడ్జెట్‌లో, ఈ రంగానికి మద్దతునిచ్చే మరియు ఆర్థిక వ్యవస్థ యొక్క స్థిరత్వం మరియు వృద్ధికి దోహదపడే విధాన నిర్ణయాలు మరియు నియంత్రణ సంస్కరణలు ఉండవచ్చని భావిస్తున్నారు. ఈ సంప్రదింపుల ద్వారా లభించిన సిఫార్సులు, ప్రస్తుత ఆర్థిక సవాళ్లను పరిష్కరించడంలో మరియు భారతదేశాన్ని $5 ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలనే లక్ష్యం వైపు ముందుకు తీసుకెళ్లడంలో కీలక పాత్ర పోషిస్తాయని ప్రభుత్వం భావిస్తోంది.

# ట్రిబ్యునళ్ల చట్టంపై సుప్రీంకోర్టు కీలక తీర్పు

- రద్దయిన నిబంధనలను మళ్లీ తేవడం రాజ్యాంగ విరుద్ధం
- కేంద్రం చేసిన స్వల్ప మార్పులు సరిపోవు – సుప్రీంకోర్టు స్పష్టం
- న్యాయవ్యవస్థ స్వాతంత్ర్యానికి విఘాతం కలిగించే నిబంధనలు అనుచితం
- ట్రిబ్యునళ్ల పదవీకాలంపై పాత ఆదేశాలను పునరుద్ధరించిన సర్వోన్నత న్యాయస్థానం



ట్రిబ్యునళ్ల సంస్కరణల చట్టం-2021ను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు బుధవారం అత్యంత కీలక నిర్ణయం వెలువరించింది. గతంలో రద్దు చేసిన నిబంధనలను స్వల్ప మార్పులతో మళ్లీ అమల్లోకి తేవడం రాజ్యాంగ విరుద్ధమని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ బృందం స్పష్టంచేసింది. కేంద్ర ప్రభుత్వం చట్టంలో చేసిన మార్పులు న్యాయవ్యవస్థ స్వాతంత్ర్యాన్ని దెబ్బతీసే అవకాశమున్నాయని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఈ చట్టంలోని నియామకాలు, సర్వీసు కండీషన్లు, పదవీకాలానికి సంబంధించిన పలు నిబంధనలను ముందే సుప్రీంకోర్టే కొట్టివేసిందని, వాటిని స్వల్ప మార్పులతో తిరిగి ప్రవేశపెట్టడం రాజ్యాంగ సూత్రాలకు విరుద్ధమని కోర్టు హెచ్చరించింది. అధికార వికేంద్రీకరణకు విరుద్ధంగా ఉన్న ఈ నిబంధనలను అమలు చేయాల్సిన అవసరమే లేదని స్పష్టం చేసింది.

దీంతోపాటు, ట్రిబ్యునళ్ల సభ్యుల పదవీకాలంపై గతంలో ఇచ్చిన ఆదేశాలను ధర్మాసనం పునరుద్ధరించింది. ముఖ్యంగా ఆదాయపు పన్ను అప్పిలేట్ ట్రైబ్యునల్, కస్టమ్స్-ఎక్సైజ్, సర్వీస్ ట్యాక్స్ అప్పిలేట్ ట్రైబ్యునళ్ల సభ్యులు 62 ఏళ్ల వరకు పదవిలో కొనసాగవచ్చని తెలిపింది. ట్రిబ్యునళ్ల ఛైర్‌పర్సన్లు రిటైర్మెంట్ వయసు 65 ఏళ్లు కొనసాగుతుందని తెలిపింది. ఈ వ్యవస్థను మరింత పారదర్శకంగా మార్చేందుకు జాతీయ ట్రిబ్యునల్స్ కమిషన్ ఏర్పాటు చేయాలని కూడా సుప్రీంకోర్టు సూచించింది. 2021లో కేంద్రం తీసుకొచ్చిన సంస్కరణల చట్టంతో ఫిల్మ్ సర్టిఫికేషన్ అప్పిలేట్ ట్రిబ్యునల్‌తో సహా పలు అప్పిలేట్ ట్రైబ్యునళ్లు రద్దయ్యాయి. అలాగే సభ్యుల నియామక నిబంధనల్లో గణనీయ మార్పులు జరిగినవి. ఈ నిబంధనలను వ్యతిరేకిస్తూ మద్రాస్ బార్ అసోసియేషన్ సహా పలువురు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. విచారణ ముగిసిన తర్వాత కోర్టు తీర్పును రిజర్వ్ చేయగా, ఇప్పుడు కీలక వ్యాఖ్యలతో తీర్పును ప్రకటించింది. ఈ తీర్పుతో ట్రిబ్యునళ్ల వ్యవస్థపై కేంద్రం చేసిన మార్పులకు గట్టి చెక్‌పెట్టినట్లు న్యాయ వర్గాలు భావిస్తున్నాయి. న్యాయ వ్యవస్థ స్వాతంత్ర్యం, పారదర్శకతను కాపాడేందుకు ఈ తీర్పు కీలక మలుపుగా గుర్తిస్తున్నారు.

# 'వోకల్ ఫర్ లోకల్' మంత్రం

- పుట్టపర్తి వేడుకల్లో ప్రధాని మోదీ కీలక పిలుపు
- సత్యసాయి శతజయంతి సభలో ప్రధాని సందేశం
- రూ.100 స్మారక నాణెం, తపాలా బిళ్లల ఆవిష్కరణ
- స్థానిక ఉత్పత్తులను ప్రోత్సహించాలి: మోదీ



శ్రీ సత్యసాయి బాబా బోధించిన ప్రేమ, సేవా మార్గాలు ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మందిని ప్రభావితం చేస్తున్నాయని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పుట్టపర్తిలో జరిగిన శతజయంతి వేడుకల్లో వెల్లడించారు. ఈ చారిత్రక కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబుతో కలిసి పాల్గొన్న ప్రధాని, రూ.100 విలువైన స్మారక నాణెం, ప్రత్యేక తపాలా బిళ్లలను ఆవిష్కరించారు. హిల్‌వ్యూ స్టేడియంలో జరిగిన సభలో మాట్లాడిన మోదీ, సత్యసాయి జీవితం 'వసుధైవ కుటుంబం' అనే భారతీయ భావనకు ప్రత్యక్ష ఉదాహరణ అని కొనియాడారు. "లవ్ ఆల్, సర్వ్ ఆల్" అనే బాబా బోధన అజరామరమై ప్రజలకు మార్గదర్శకంగా నిలుస్తోందన్నారు. బాబా భౌతికంగా లేకపోయినా, ఆయన స్థాపించిన సంస్థలు మానవ సేవే మాధవసేవ భావనతో విస్తృత సేవలను కొనసాగిస్తున్నాయని చెప్పారు. గతంలో భుజ్ భూకంపం వంటి విపత్తుల సమయంలో సత్యసాయి సేవాదళ్ చేసిన సేవలను గుర్తుచేసిన ప్రధాని, బాబా కార్యాచరణ ఎన్నో తరాలను స్ఫూర్తి పరుస్తోందని పేర్కొన్నారు. ఈ వేడుక సందర్భంగా సత్యసాయి ట్రస్టు ఆధ్వర్యంలో 100 గిర్ జాతి ఆవులను పేద కుటుంబాలకు ఆయన చేతుల మీదుగా అందజేశారు. 'రాష్ట్రీయ గోకుల్ మిషన్' ద్వారా పశుసంవర్ధక రంగంలో సానుకూల మార్పులు వస్తున్నాయని వెల్లడించారు. దేశం 'వికసిత్ భారత్' విజన్‌తో ముందుకు సాగుతుండగా, ప్రజల భాగస్వామ్యం అత్యంత ప్రధానమని మోదీ అన్నారు. ప్రతి ఒక్కరూ 'వోకల్ ఫర్ లోకల్' మంత్రాన్ని ఆచరణలో పెట్టి స్థానిక ఉత్పత్తులను ప్రోత్సహించాలని ఆయన పిలుపునిచ్చారు. స్థానిక మార్కెట్ల బలోపేతంతో గ్రామీణ ఆర్థిక వ్యవస్థలు బలపడతాయని, తద్వారా 'ఆత్మనిర్భర్ భారత్' లక్ష్యం సాకారం అవుతుందని తెలిపారు. సత్యసాయి బాబా చూపిన కరుణ, శాంతి, సేవా మార్గాలే దేశాన్ని ముందుకు నడిపే శక్తి అని ప్రధాని పేర్కొన్నారు. ఆయన బోధనలను ఆచరణలో పెట్టి దేశ అభివృద్ధికి ప్రతి పౌరుడు కృషి చేయాలని సూచించారు.

# సమాజానికి ఉపయోగపడే ఆవిష్కరణలే నిజమైన పురోగతి

- ఎన్ఐటీ ఢిల్లీలో ఐదో కన్వొకేషన్ సభలో రాష్ట్రపతి సందేశం
- విద్యార్థుల ఆవిష్కరణలు అసమానతలను తగ్గించాలి
- ప్రజల జీవితాల్లో కొత్త ఆశ నింపే టెక్నాలజీల అవసరం
- రాష్ట్రపతి ద్రౌపది ముర్ము




జాతీయ సాంకేతిక విద్యాసంస్థ ఢిల్లీ ఐదో కన్వొకేషన్ కార్యక్రమానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము హాజరై, పట్టాలు అందుకున్న విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, నిజమైన పురోగతి ఆవిష్కరణల్లోనే కాదు, ఆ ఆవిష్కరణలు సమాజంపై చూపే సానుకూల ప్రభావంలో ఉందని అన్నారు. సాంకేతికత, సిస్టమ్స్, సొల్యూషన్లు కేవలం ఆధునికతకే పరిమితం కాకుండా, అసమానతలను తగ్గించి ప్రజల జీవితాల్లో కొత్త ఆశ నింపేలా ఉండాలని రాష్ట్రపతి సూచించారు. దేశ అభివృద్ధి ప్రయాణంలో యువత కీలక పాత్ర పోషిస్తారని, వారి కలలు, కృషి, ఆవిష్కరణలు భారత భవిష్యత్తును తీర్చిదిద్దుతాయని పేర్కొన్నారు. సామాజిక బాధ్యతతో సాంకేతికతను ఉపయోగించాలని, పేదల జీవన ప్రమాణాలు మెరుగుపడే విధంగా శాస్త్రీయ ఆవిష్కరణలు రూపుదిద్దుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. ప్రజలకు ఉపయోగపడే పరిశోధనలే శాస్త్ర సాంకేతిక రంగానికి అసలైన విలువ తెస్తాయని రాష్ట్రపతి స్పష్టం చేశారు. యువతలో నైపుణ్యాభివృద్ధి, సృజనాత్మకత, నైతికత అత్యంత ముఖ్యమని, విద్యతో పాటు మానవతా విలువలు కూడా సమానంగా పెరగాలని ద్రౌపది ముర్ము సూచించారు. దేశం ఎదుర్కొంటున్న అనేక సామాజిక, ఆర్థిక సమస్యలకు యువ శాస్త్రవేత్తలే వినూత్న పరిష్కారాలు అందించగలరని ఆమె నమ్మకం వ్యక్తం చేశారు. ఎన్ఐటీ ఢిల్లీలో జరిగిన ఈ కన్వొకేషన్‌లో దేశభవిష్యత్తు కోసం విద్యార్థులు సాంకేతిక ఉత్తమతను సామాజిక బాధ్యతతో కలిపి ముందుకు సాగాలని రాష్ట్రపతి పిలుపునిచ్చారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# నటి శ్రియ పేరుతో నకిలీ వాట్సాప్ ఖాతా కలకలం

దేశంలో సైబర్ మోసాలు కొత్త కొత్త రూపాల్లో వెలుగుచూస్తుండగా, ఇప్పుడు బాలీవుడ్-టాలీవుడ్‌కు చెందిన ప్రముఖ నటీమణుల పేర్లు కూడా మోసగాళ్ల చేతికి ఆయుధాలుగా మారుతున్నాయి. కొద్ది రోజుల క్రితం నటి అదితి రావు హైదరీ పేరుతో సృష్టించిన నకిలీ వాట్సాప్ ఖాతాతో ఫోటోగ్రాఫర్లను టార్గెట్ చేసిన ఘటన పెద్దగా హడావుడి చేసింది. ఆ ప్రభంజనం చల్లారక ముందే ఇప్పుడు నటి శ్రియ శరణ్ కూడా ఇదే మోసగాళ్ల బారినపడింది.



తన పేరుతో నకిలీ వాట్సాప్ నంబర్ తిరుగుతోందని తెలుసుకున్న వెంటనే, ఈ విషయంపై శ్రియ స్వయంగా సోషల్‌మీడియా వేదికగా స్పందించారు. ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేస్తూ అభిమానులకు అప్రమత్తం కావాలని హెచ్చరిక జారీ చేశారు.

“సోషల్ మీడియాలో తిరుగుతున్న ఈ వాట్సాప్ నంబర్ నాది కాదు. నా పేరుతో డబ్బులు అడుగుతున్నవారితో జాగ్రత్తగా ఉండండి. ఇలాంటి సంఘటనలు చాలా బాధ కలిగిస్తాయి. ముఖ్యంగా, ఆ నకిలీ వ్యక్తి నా కుటుంబ సభ్యులకు, నేనిప్పుడు పనిచేయబోయే వారికి కూడా మెసేజ్‌లు పంపుతున్నాడంటే మరింత ఆందోళనగా ఉంది. అతడితో ఎలాంటి కమ్యూనికేషన్ చేయకండి” అని శ్రియ స్పష్టం చేశారు.

ఇటీవలి కాలంలో సెలెబ్రిటీల పేరుతో నకిలీ అకౌంట్లు సృష్టించి డబ్బులు దోచుకునే సంఘటనలు పెరుగుతున్న నేపథ్యంలో, సైబర్ నిపుణులు కూడా ప్రజలు మరింత జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్నారు. ప్రత్యేకంగా సెలెబ్రిటీ పేరుతో వచ్చే సందేశాలను నిర్ధారించకుండా నమ్మకూడదని హెచ్చరిస్తున్నారు.

ప్రస్తుతం శ్రియ పోస్ట్ సోషల్‌మీడియాలో విస్తృతంగా షేర్ అవుతూ, నకిలీ మోసగాళ్లపై అవగాహన పెంచుతోంది.

# రామ్ పోతినేని ‘ఆంధ్రా కింగ్ తాలూకా’ ట్రైలర్ రిలీజ్

టాలీవుడ్ ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని నటిస్తున్న తాజా మాస్ ఎంటర్‌టైనర్ ‘ఆంధ్రా కింగ్ తాలూకా’ నుండి ట్రైలర్‌ను చిత్ర బృందం విడుదల చేసింది. ట్రైలర్ విడుదలైన కొద్దిసేపటికే సోషల్ మీడియా అంతా హల్‌చల్ చేస్తూ యూట్యూబ్ ట్రెండింగ్‌లోకి దూసుకెళ్లింది. రామ్ ఈ చిత్రంలో మాస్ అటిట్యూడ్‌తో, పవర్‌ఫుల్ స్క్రీన్ ప్రెజెన్స్‌తో కనిపించడం అభిమానుల్లో భారీ ఎక్సైట్మెంట్ రేపింది.



దర్శకుడు పి. మహేష్ బాబు రూపొందిస్తున్న ఈ సినిమాలో రామ్ పాత్ర పూర్తిగా మాస్ ఎనర్జీతో నిండి ఉంది. ముఖ్యంగా రామ్ డైలాగ్ డెలివరీ, స్టైల్, యాక్షన్ సీక్వెన్సులు ట్రైలర్ మొత్తం హైలైట్‌గా నిలిచాయి. ఈసారి రామ్ పూర్తిగా తన ఓల్డ్ మాస్ ఫార్మ్‌లోకి వెళ్లాడని ట్రైలర్ చూసిన వాళ్లు కామెంట్స్‌లో ప్రశంసిస్తున్నారు. రామ్ నటనలో ఉన్న ఫైర్ ఈ చిత్రానికి పెద్ద ప్లస్ అవుతుందని ఫ్యాన్స్ నమ్ముతున్నారు.

ఈ సినిమాలో కన్నడ సూపర్ స్టార్ ఉపేంద్ర పోషించిన ‘ఆంధ్రా కింగ్’ పాత్ర కథలో కీలకం. ట్రైలర్‌ను పరిశీలిస్తే ఉపేంద్ర పాత్రకు రామ్ ఉన్న అత్యంత వీరాభిమానం కథలో ప్రధాన ఎమోషనల్ లైన్‌గా అమరింది. ఒక అభిమాని తన అభిమాన నటుడిని ఎంతగానో ప్రేమిస్తాడో, ఆ ప్రేమను దుర్వినియోగం చేసే సందర్భాలు వచ్చేప్పుడు ఏం జరుగుతుందో అనే ఆసక్తికరమైన కోణాన్ని దర్శకుడు చూపించనున్నాడనే సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. రామ్-ఉపేంద్రల మధ్య ఉన్న ఫ్యాన్-స్టార్ కనెక్షన్ ట్రైలర్ చివరి క్షణాల్లో మరింత భావోద్వేగంగా ఉత్కంఠ కలిగించింది.

ఇదిలా ఉండగా, మైత్రీ మూవీ మేకర్స్ నిర్మించిన ఈ చిత్రానికి వివేక్-మెర్విన్ అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ట్రైలర్‌కు అదనపు శక్తినిచ్చింది. సినిమాటోగ్రఫీ గ్రాండియర్‌గా ఉండటం, ప్రతి ఫ్రేమ్‌లో రిచ్ విజువల్స్ కనిపించడం ద్వారా ఈ చిత్రం భారీ మాస్ ఎంటర్‌టైనర్‌గా ప్రేక్షకుల ముందు రాబోతుందనే నమ్మకాన్ని కలిగించింది. భాగ్యశ్రీ బోర్సే ఈ చిత్రంలో రామ్ సరసన నటిస్తుండగా, రావు రమేష్, మురళీ శర్మ, సత్య, రాహుల్ రామకృష్ణ తదితరులు కీలక పాత్రలను పోషిస్తున్నారు.

పూర్తిగా మాస్ యాక్షన్, స్టైల్, ఎమోషన్ కలయికతో వచ్చే ‘ఆంధ్రా కింగ్ తాలూకా’ నవంబర్ 28, 2025న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ ట్రైలర్ చూస్తుంటే రామ్ మరోసారి థియేటర్లలో మాస్ హవా క్రియేట్ చేయడం ఖాయమని అభిమానులు అంటున్నారు.

# ‘వారణాసి’ నుంచి పృథ్వీరాజ్ మాస్ సాంగ్ ‘రణ కుంభ’

దిగ్గజ దర్శకుడు రాజమౌళి - మహేశ్ బాబు కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న భారీ పాన్-ఇండియా చిత్రం ‘వారణాసి’పై ఇప్పటికే అభిమానుల్లో అంచనాలు ఆకాశానికి చేరాయి. పీరియాడికల్ యాక్షన్ డ్రామాగా వస్తోన్న ఈ చిత్రంలో మహేశ్ బాబు కొత్త అవతారంలో కనిపించబోతున్నట్టు సంకేతాలు స్పష్టంగా ఉన్నాయి. అలాంటిది ఈ సినిమాకు సంబంధించిన ప్రమోషనల్ కంటెంట్ ఏదైనా వచ్చినా సోషల్ మీడియాలో వైరల్ కావడం ఖాయం.



ఈ నేపథ్యంలో తాజాగా చిత్రబృందం విలన్ పాత్రలో నటిస్తున్న పృథ్వీరాజ్ సుకుమారన్‌కు సంబంధించిన సాంగ్ ‘రణ కుంభ’ ఆడియోను విడుదల చేసింది. “ప్రళయం... ప్రళయం...” అంటూ పవర్‌ఫుల్‌గా ప్రారంభమయ్యే ఈ సాంగ్ పూర్తిగా మాస్ ఎలిమెంట్స్‌తో నిండి ఉంది. పృథ్వీరాజ్ పోషిస్తున్న కుంభ పాత్ర యొక్క క్రూరత్వం, ఘోరమైన శక్తి, రాజసం ఈ పాటలో స్పష్టంగా ప్రతిబింబించింది. స్క్రీన్‌పై విలన్ ఎంత భయంకరంగా కనిపిస్తాడో, ఆ భయాన్ని ప్రేక్షకుల చెవుల్లో ముందుగానే వినిపించే విధంగా ఎంఎం కీరవాణి ఈ కంపోజిషన్‌ను రూపొందించారు.

సినిమాలో పృథ్వీరాజ్ పాత్ర అత్యంత కీలకమని, మహేశ్ బాబు పాత్రకు పూర్తి విరుద్ధంగా నిలబడి కథను ముందుకు నడిపిస్తుందని ఇప్పటికే చిత్ర యూనిట్ క్లారిటీ ఇచ్చింది. దీనికి కొనసాగింపుగానే వచ్చిన ‘రణ కుంభ’ సాంగ్‌లో ఉన్న భారీతనం కథలోని ద్వంద్వత్వాన్ని అద్భుతంగా చేరవేసింది. ముఖ్యంగా కోరస్ భాగాలు, శంఖ నాదాలు, యుద్ధ డ్రమ్స్‌లాంటి సౌండ్ ఎలిమెంట్స్ పాటకు మరింత ఫైర్ ఇచ్చాయి.

ఇటీవలే రామోజీ ఫిల్మ్ సిటీలో నిర్వహించిన ‘గ్లోబ్‌ట్రాటర్’ ఈవెంట్‌లో ఈ పాటను ప్రత్యక్షంగా పృథ్వీరాజ్ పాడినట్లు సమాచారం. అప్పుడే ప్రేక్షకులు స్పందించి నిలబడేలా చప్పట్లతో హోరెత్తించారు. ఇప్పుడు ఆ పాట అధికారికంగా రిలీజ్ అయి యూట్యూబ్‌లో అప్రతిహతంగా వైరల్ అవుతోంది. మహేశ్ అభిమానులు మాత్రమే కాదు, పృథ్వీరాజ్ అభిమానులు కూడా ఈ పాటను భారీగా షేర్ చేస్తున్నారు.

కేఎల్ నారాయణ దర్శకత్వం వహిస్తున్న ఈ భారీ ప్రాజెక్ట్‌లో ప్రియాంక చోప్రా కథానాయికగా నటిస్తుండటం మరో ప్రత్యేక ఆకర్షణ. రాజమౌళి - కీరవాణి కాంబినేషన్ అంటేనే ప్రేక్షకులకు ప్రత్యేక అంచనాలు ఉంటాయి. ఈ సాంగ్ ఆ అంచనాలను మరింత పెంచి సినిమా కోసం వేచి చూస్తున్న ఫ్యాన్స్‌లో ఉత్సాహాన్ని రెట్టింపు చేసింది




# భార్య కోసం విఘ్నేష్ శివన్ ఇచ్చిన విలువైన గిఫ్ట్!

లేడీ సూపర్ స్టార్ నయనతార బుధవారం తన 41వ పుట్టిన రోజును జరుపుకుంటున్నారు. తెలుగుతో పాటు తమిళ, మళయాళ రంగాల్లో స్టార్‌డమ్ సొంతం చేసుకున్న నయన్‌కు ఈ ప్రత్యేక రోజున సినీ తారలు, మిత్రులు, అభిమానుల నుంచి శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. అయితే ఈ బర్త్‌డేలో అందరి దృష్టిని ఆకర్షించిన విషయం ఒక్కటే—ఆమె భర్త విఘ్నేష్ శివన్ ఇచ్చిన లగ్జరీ గిఫ్ట్.

నయన్ పుట్టినరోజు సందర్భంగా విఘ్నేష్ శివన్ తన భార్యపై ఉన్న ప్రేమను సోషల్ మీడియాలో వ్యక్తం చేస్తూ ఒక గ్రాండ్ సర్ప్రైజ్ గిఫ్ట్‌ను అందించారు. అదే రోల్స్ రాయిస్ బ్లాక్ బ్యాడ్జ్ స్పెక్టర్. భారత మార్కెట్లో ఈ లగ్జరీ ఎలక్ట్రిక్ కార్ ధర సుమారు రూ.10 కోట్లు ఉండటం విశేషం. ఈ ఖరీదైన గిఫ్ట్‌ను అందుకున్న నయన్ ఆనందాన్ని దాచుకోలేకపోయారు.

విఘ్నేష్ తన ఇన్‌స్టాగ్రామ్‌లో నయనతార, ఇద్దరు పిల్లలు ఉయిర్ & ఉలగ్‌తో కలిసి తీసుకున్న ఫోటోలను పంచుకున్నారు. కొత్త కారు ముందు నిలబడి దిగిన ఈ ఫోటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. "క్యూట్ ఫ్యామిలీ", "గోల్స్", "పర్ఫెక్ట్ కపుల్" అంటూ నెటిజన్లు కామెంట్లతో ముంచెత్తుతున్నారు.

తన స్టైల్, స్టార్ ఇమేజ్, వ్యక్తిత్వం నయనతార బర్త్‌డేను విఘ్నేష్ శివన్ నిజంగా రాయల్టీ లెవెల్లో సెలబ్రేట్ చేశారు.

# నా నిర్ణయం ముఖ్యం

## అని దీపికపదుకొనే వ్యాఖ్యలు

బాలీవుడ్‌లో అగ్రశ్రేణి నటీమణులలో ఒకరైన దీపికపదుకొనే ఇటీవల వరుసగా రెండు భారీ చిత్రాలకు నో చెప్పిన విషయం అందరికీ తెలిసిందే. ఇప్పటికే ప్రభాస్‌తో వచ్చిన కల్కి 2898 ఏడీ చిత్రంలో కీలక పాత్ర పోషించిన ఆమె, ఈ చిత్ర సీక్వెల్‌కు కూడా ఆహ్వానం అందుకున్నా తిరస్కరించింది. అలాగే దర్శకుడు సందీప్ రెడ్డి వంగా, హీరో ప్రభాస్ కాంబినేషన్‌లో రూపొందనున్న స్పిరిట్ చిత్రంలో ఆమెను హీరోయిన్‌గా పరిశీలించినప్పటికీ, దీనిని కూడా చేయబోనని చెప్పింది.

ఈ రెండు చిత్రాలు అత్యంత భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న నేపథ్యంలో, దీపిక తీసుకున్న నిర్ణయం సోషల్ మీడియాలో చర్చనీయాంశమైంది. డబ్బు కోసమా? తేదీలు కలపలేకపోయిందా? అనే ప్రశ్నలు వినిపిస్తున్న వేళ, దీపిక తాజాగా స్పందించింది. తాను ఏ చిత్రాన్ని చేయాలనుకుంటానో, చేయకూడదనుకుంటానో నిర్ణయించుకునే సమయంలో బడ్జెట్ లేదా వసూళ్లు అసలు ప్రమాణాలే కాదని స్పష్టం చేసింది.

తనకు ఆరోగ్యకరమైన పని వాతావరణం అత్యంత ముఖ్యమని, ప్రతిదినం ఎనిమిది గంటల కంటే ఎక్కువ పని చేయడానికి ఇష్టపడనని తెలిపింది.

కొన్నిసార్లు భారీ పారితోషికం ఆఫర్ చేసినా కూడా, మనసుకు నచ్చకపోతే ఆ సినిమా చేయడం సరైన నిర్ణయం కాదని అభిప్రాయపడింది. పని చేసే స్థలం, కథ, తన పాత్ర—ఇవే నిర్ణయాత్మక అంశాలని స్పష్టం చేసింది.

దీపిక చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతూ, సినీ వర్గాల్లో పెద్ద చర్చకు దారితీశాయి. ఆమె నిర్ణయాలను అభిమానులు, నెటిజన్లు వివిధ కోణాల్లో విశ్లేషిస్తున్నారు.





# వా వాతియార్‌కు తెలుగు పేరు ఖరారు..

## కార్తీ కొత్త లుక్‌కు భారీ హైప్

కోలీవుడ్‌లో తానేంటో నిరూపించుకున్న నటుల్లో కార్తీ ఒకరు. తమిళంతో పాటు తెలుగులో కూడా మంచి అభిమాన వర్గం ఉన్న ఈ నటుడు ప్రస్తుతం నటిస్తున్న చిత్రం వా వాతియార్. ఈ చిత్రానికి నలన్ కుమారస్వామి దర్శకత్వం వహిస్తుండగా, స్టూడియో గ్రీన్ పతాకంపై కేఈ జ్ఞానవేల్ రాజా నిర్మాణం చేస్తున్నారు. ఉప్పెన చిత్రంతో గుర్తింపు పొందిన కృతి శెట్టి ఇందులో కథానాయికగా నటిస్తోంది. సత్యరాజ్, రాజ్‌కిరణ్, జీఎం సుందర్ తదితరులు కీలక పాత్రల్లో కనిపిస్తున్నారు.

ఈ చిత్రాన్ని డిసెంబరులో తమిళంతో పాటు తెలుగులో కూడా విడుదల చేయేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. విడుదల తేదీపై అధికారిక ప్రకటన కోసం అభిమానులు ఎదురుచూస్తున్నారు. తెలుగులో కార్తీ సినిమాలకు ఎప్పటిలాగే మంచి మార్కెట్ ఉండటంతో, ఈ చిత్రం కూడా భారీగా ఆకట్టుకుంటుందనే అంచనాలు వినిపిస్తున్నాయి.

ఇక తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన తాజా అప్‌డేట్‌ను స్టూడియో గ్రీన్ ప్రకటించింది. వా వాతియార్‌కు తెలుగులో “అన్నగారు వస్తారు” అనే టైటిల్‌ను ఖరారు చేశారు. ఇదే సమయంలో విడుదల చేసిన కార్తీ కొత్త పోస్టర్ నెట్టింట దుమ్మురేపుతోంది. ఖాకీ చొక్కా, ఎర్రని స్టైలిష్ కళ్లజోడుతో రూపొందించిన ఈ లుక్ అభిమానుల్లో భారీ హైప్‌ను క్రియేట్ చేసింది.

చిత్రానికి సంతోష్ నారాయణన్ సంగీతం అందిస్తుండగా, యాక్షన్, భావోద్వేగాలకు పెద్ద పీట వేసిన కథతో ఈ చిత్రం ప్రేక్షకులను ఆకట్టుకుంటుందని చిత్రబృందం విశ్వాసం వ్యక్తం చేస్తోంది. ఇదిలా ఉంటే, కార్తీ కెరీర్‌లో సూపర్ హిట్‌గా నిలిచిన ఆవారా చిత్రం ఈ నెల 22న తెలుగులో మళ్లీ విడుదల కానుండటం మరో ప్రత్యేకతగా నిలుస్తోంది.

# ‘కితకితలు’ తీయడం ఇప్పుడు కష్టమే

## కామెడీ సినిమాలపై అల్లరి నరేశ్ ముచ్చటైన వ్యాఖ్యలు



టాలీవుడ్‌లో కామెడీ సినిమాలో తన ప్రత్యేకత చూపిన యాక్టర్ అల్లరి నరేశ్ లీడ్ రోల్‌లో నటిస్తున్న చిత్రం ‘12A రైల్వే కాలనీ’ నవంబర్ 21న ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఈ సినిమాకు నాని కాసరగడ్డ దర్శకత్వం వహిస్తున్నాడు. డాక్టర్ కామాక్షి భాస్కర్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమా ట్రైలర్‌కు ఇప్పటికే మంచి స్పందన వచ్చింది.

ప్రచారాల సందర్భంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో అల్లరి నరేశ్ కామెడీ సినిమాలపై ఆసక్తికర విషయాలు వెల్లడించారు. “కామెడీ సినిమాలు తీయడం ఇప్పుడు చాలా కష్టతరమైన పరిస్థితి. ఇప్పుడు చిన్నపాటి ‘కితకితలు’ చేస్తే బాడీ షేమింగ్, వ్యక్తిగత సున్నిత అంశాలపై ప్రతికూల స్పందన వస్తుంది. ప్రేక్షకులు ఇప్పుడు ఆర్గానిక్‌గా, సెన్సిబుల్‌గా ఉండే కామెడీ కోరుకుంటున్నారు. జోకులు ఖచ్చితంగా ఆర్గానిక్‌గా ఉండాలి, ఇతర మీడియా మీమ్స్ కాపీ చేయకూడదు” అని అల్లరి నరేశ్ అన్నారు.

అతను గతంలో రైమింగ్ డైలాగ్స్, కౌంటర్స్‌తో సాగే కామెడీ సినిమాలు చేస్తారని, ఇప్పుడు ప్రేక్షకుల అభిరుచి ప్రతీ దశాబ్దానికి మారుతూ వస్తుందన్నారు. ఈ పరిస్థితుల్లో సున్నితమైన, భావోద్వేగాలను దెబ్బతీశే సన్నివేశాలు తప్పించుకోవడం అవసరమని చెప్పారు.

ఈ చిత్రంలో సాయికుమార్, వైవా హర్ష, గెటప్ శ్రీను, సద్దాం, గగన్ విహారి, అనిష్ కురువిల్లా, మధుమణి కీలక పాత్రల్లో నటిస్తున్నారు. భీమ్స్ సిసిరోలి సంగీతం అందిస్తున్నారు. శ్రీనివాస సిల్వర్ స్క్రీన్ బ్యానర్‌పై శ్రీనివాస్ చిట్టూరి నిర్మిస్తున్న ఈ సినిమాకు ‘పొలిమేర’, ‘పొలిమేర 2’ ఫేం డాక్టర్ అనిల్ విశ్వనాథ్ కథ, స్క్రీన్‌ప్లే, సంభాషణలు సమకూర్చుతున్నారు.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in